


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | సోమవారం 10-02-2025 | సంపుటి - 21 | సంచిక -293 | రూ : 4 | పేజీలు: 8




### ఇందిరమ్మ ఇళ్ల ప్రీ-గ్రౌండింగ్

# సమావేశాలకు ఏర్పాట్లు

- **గ్రామాల్లో లబ్ధిదారులకు నిబంధనల వివరణ**
- **వారం రోజుల్లో పూర్తి**

హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాను అధికారులు తయారు చేశారు. ఈ మేరకు ఇళ్ల గ్రౌండింగ్ కోసం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అందులో భాగంగా మొదట ఆయా గ్రామాల్లో ప్రీగ్రౌండింగ్ సమావేశాల ఏర్పాటుకు యంత్రాంగం సిద్ధమవుతోంది. లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇంటిని ఎలా నిర్మించుకోవాలి, నిర్మాణ సామగ్రి సరఫరా, ఇతర అనుమానాలను ఇందులో నివృత్తి చేయనున్నారు.

**వివరించనున్న అంశాలు**

* ఇందిరమ్మ యాప్ సర్వే సమయంలో సొంత స్థలం చూపిన ప్రాంతంలో లబ్ధిదారుడే ముగ్గు పోసుకోవాల్సి ఉంటుంది. మరోచోట కట్టుకుంటానంటే ఆ ఇంటిని అధికారులు రద్దు చేస్తారు.
* ముగ్గు పోసిన తర్వాత గ్రామ కార్యదర్శికి సమాచారం అందిస్తే క్షేత్రస్థాయికి వచ్చి ఫొటోలు తీసి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. నిర్మాణ ప్రదేశాన్ని జియో ట్యాగింగ్ చేస్తారు.
* కనీసం 400 చదరపు అడుగులు కంటే తక్కువ కాకుండా ఇంటిని నిర్మించుకోవాల్సి ఉంటుంది.
* ముగ్గు పోసే సమయంలో ప్రభుత్వం

తరువాయి 2లో

# కేంద్రం వివక్షపై దక్షిణాది ఏకమవ్వాలి

- **తప్పనిసరైతే నేను చొరవ తీసుకుంటా**
- **'తెలంగాణ రైజింగ్' 4 కోట్ల మంది ప్రజల స్వప్నం**
- **మా రాష్ట్రానికి కేంద్రం ఎందుకు మద్దతు ఇవ్వదు?**
- **ఒకే దేశం.. ఒకే ఎన్నిక నినాదం వెనుక ప్రధానమంత్రి మోదీ రహస్య ఎజెండా**
- **'మాతృభూమి ఇంటర్నేషనల్ ఫెస్టివల్ ఆఫ్ లెటర్స్' సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**

హైదరాబాద్: ''కేంద్ర ప్రభుత్వం దక్షిణాది రాష్ట్రాలకు, భాజపాయేతర ప్రభుత్వాలున్న రాష్ట్రాలకు మద్దతుగా నిలవడం లేదు. వివక్ష చూపుతోంది. రాష్ట్రాల హక్కుల రక్షణకు దక్షిణాది రాష్ట్రాలైన కేరళ, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు పుదుచ్చేరి ప్రజలు ఏకమవ్వాలి. తప్పనిసరైతే ఈ విషయంలో నేను చొరవ తీసుకుంటా'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఉత్తరాది రాష్ట్రాలతో పోల్చితే మెరుగైన సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినందుకు దక్షిణాది రాష్ట్రాలను శిక్షిస్తున్నారా అని ప్రశ్నించారు. కేరళ రాష్ట్రం తిరువనంతపురంలో ఆదివారం మలయాళీ దినపత్రిక మాతృభూమి నిర్వహించిన 'మాతృభూమి ఇంటర్నేషనల్ ఫెస్టివల్ ఆఫ్ లెటర్స్' సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పత్రిక ఎడిటర్ మనోజ్ కె.దాస్‌తో పాటు.. కార్యక్రమంలో పాల్గొన్న

తరువాయి 2లో



### కోర్టుల్లో అధిక శాతం

# పిటిషన్లు విడాకులవే..

- **కమ్యూనిటీల వారీగా కేసుల పరిష్కారానికి కృషి చేయాలి**
- **హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్ పాల్**

2లో



## ప్రజల కోసం పనిచేయండి..

- **కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలతో కేజ్రీవాల్**

దిల్లీ: ప్రజల కోసం పనిచేయాలని దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో నెగ్గిన పార్టీ ఎమ్మెల్యేలకు ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ సూచించారు.

తరువాయి 2లో



### బోనస్ ఇవ్వక రైతులను

# మోసం చేసిన ప్రభుత్వం

- **రూ.432 కోట్ల బకాయిలు విడుదల చేయాలి**
- **సీఎం రేవంత్‌కు హరీశ్ బహిరంగ లేఖ**

2లో



### తీర రక్షణపై

# తిరుగులేని విన్యాసాలు!



విశాఖపట్నం (సింధియా), : తీర భద్రతలో భాగంగా త్రివిధ దళాలు పాల్గొనే 'ట్రోపెక్స్2025' విన్యాసాలు కొనసాగుతున్నాయని ఆదివారం నేవీ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. నావికా, పదాతి దళాలు, వాయుసేన, తీరగస్తీ దళాలు ఇందులో భాగస్వామ్యం అయినట్లు పేర్కొన్నాయి. యుద్ధ నైపుణ్య ప్రదర్శన, సమగ్ర స్పందన, జాతి రక్షణ, తీర భద్రతకు అనుసరించాల్సిన విధానాలపై విన్యాసాలు సాగుతున్నట్టు స్పష్టం చేశాయి. 65 యుద్ధ నౌకలు, 9 జలాంతర్గాములు, 80 ఎయిర్‌క్రాఫ్ట్‌లు, యుద్ధ విమానాల రవాణా నౌక 'ఐఎన్ఎస్ విక్రాంత్, మిగ్ 29కే, పీ81, సీగార్డియన్, ఎంహెచ్ 60ఆర్ హెలికాప్టర్లు, సుఖోయ్30, జాగ్వార్, అవాక్స్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు, 10 ఐసీజీ వెసల్స్ విన్యాసాల్లో పాల్గొన్నట్లు వెల్లడించాయి.

### పార్టీ కార్యక్రమాలకు

# దూరంగా ఉండండి

- **జనసేన నేత కిరణ్ రాయల్‌కు అధిష్ఠానం ఆదేశం**

తిరుపతి (బైరాగిపట్టెడ) : జనసేన పార్టీ తిరుపతి ఇన్‌ఛార్జి కిరణ్ రాయల్‌పై రెండు రోజులుగా వస్తున్న అభియోగాలపై అధిష్ఠానం స్పందించింది. ఆర్థిక లావాదేవీలు, ఇతర వివాదాలపై ఓ మహిళ ఆయనపై సామాజిక మాధ్యమాల్లో ఆరోపణలు చేసిన నేపథ్యంలో జనసేన రాష్ట్ర కార్యాలయం నుంచి ఆదివారం ఓ ప్రకటన విడుదలైంది. ఈ ఉదంతంపై సమగ్ర విచారణ జరపాలని అధినేత పవన్ కల్యాణ్ ఆదేశించారని, అప్పటివరకు కిరణ్ రాయల్ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని రాజకీయ వ్యవహారాల కమిటీ కార్యదర్శి పి.హరిప్రసాద్ అందులో పేర్కొన్నారు. జన సైనికులు, వీర మహిళలు, నాయకులు ప్రజలకు ఉపయోగపడే విషయాలపై దృష్టి

తరువాయి 2లో



# కె.కె.లైన్ విషయం రైల్వేమంత్రి దృష్టికి తీసుకెళ్లాం

- **భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి**

విశాఖపట్నం (పెదవాల్తేరు) : విశాఖలో దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యాలయానికి నిధులు కేటాయించడంతోపాటు విశాఖ డివిజన్‌ను కూడా కొనసాగించడం గొప్ప విషయమని భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. విశాఖలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆమె మాట్లాడారు. కొత్తవలస కిరండూల్ (కె.కె.)లైన్‌ను రాయగడ డివిజన్‌కు అప్పగించడంతో విశాఖ డివిజన్‌కు నష్టం జరుగుతుందని

తరువాయి 2లో



# కేంద్రం వివక్షపై దక్షిణాది ఏకమవ్వాలి

(మొదటిపేజీ తరువాయి)

పలువురు అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. "భారత ప్రభుత్వ విధానాల ఆధారంగానే మనం కుటుంబ నియంత్రణ పాటించాం. జనాభా ప్రాతిపదికన కేంద్ర ప్రభుత్వం నియోజకవర్గాల పునర్విభజన చేపడితే మనకు (దక్షిణాది రాష్ట్రాలకు) అదనంగా నియోజకవర్గాలు రాకపోగా.. కొన్నింటిని కోల్పోతాం. అందుకే ఆయా రాష్ట్రాల్లో ఉన్న సీట్లకు అదనంగా 50 శాతం స్థానాలను పెంచాలని ప్రధానమంత్రి మోదీకి సూచించా. జనాభా దామాషా ప్రకారమే నియోజకవర్గాల పునర్విభజన చేపడితే.. బీమారు (బిహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్) రాష్ట్రాల్లోని సీట్లతో.. కేంద్ర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయొచ్చు. దక్షిణాది రాష్ట్రాలపై ఆధారపడాల్సిన పని లేదు. తెలంగాణ 2035 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థ అయితే.. అది భారతదేశ వృద్ధికి ప్రయోజనం కాదా? మరి మా రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ఎందుకు మద్దతుగా నిలవడం లేదు? తెలంగాణ రైజింగ్ అనేది నినాదం కాదు.. 4 కోట్ల ప్రజల స్వప్నం. ప్రపంచంలో అత్యుత్తంగా తెలంగాణను తీర్చిదిద్దాలనేది మా లక్ష్యం.

*** ప్రధాని వైఖరి ప్రజాస్వామ్యానికి ముప్పు**

ఈ దేశం రాష్ట్రాల సమాఖ్య. ఆయన (ప్రధానమంత్రిని ఉద్దేశించి) రాష్ట్రాల ప్రాథమిక హక్కులను విస్మరించలేరు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, భాజపా వారు ప్రతి దానిని వాళ్ల నియంత్రణలోకి తెచ్చుకుంటున్నారు. రాష్ట్రాలను ఆధీనంలోకి తెచ్చుకోవాలనుకుంటున్నారు. వాటిని స్థానిక సంస్థలుగా మార్చాలని చూస్తున్నారు. ఇది ప్రజాస్వామ్యానికి ముప్పు. మన రాష్ట్రాల్లో.. మన నిధులతో.. మన సంస్కృతితో సంబంధమున్న యూనివర్సిటీలకు కేంద్రమే వీసీలను నియమించేలా మార్పులు తెస్తున్నారు. ఇది మన సంస్కృతిపై దాడి. నదుల అనుసంధానంలోనూ వారిది అదే విధానం. క్రమంగా ఒకదాని వెంట ఒకటి చొప్పున.. రాష్ట్రాల అధికారాలను లాక్కుంటున్నారు. ఇది కేంద్ర జాబితా.. ఇది రాష్ట్రాల జాబితా.. ఇది ఉమ్మడి జాబితా అని రాజ్యాంగం నిర్ణయించగా మోదీ మాత్రం అంతా కేంద్రం చేతిలోనే ఉండాలనుకుంటున్నారు. మేధావులు దీనిపై ఆలోచన చేయాలి. పీవీ నర్సింహారావు, వల్లభ్‌భాయ్ పటేల్‌లు కాంగ్రెస్‌లో అనేక హోదాల్లో పనిచేశారు. వాళ్లు అసలుసిసలు కాంగ్రెస్ నేతలు. అలాంటి వారిని కాంగ్రెస్ వ్యతిరేకులుగా భాజపా ముద్రవేసే ప్రయత్నం చేస్తోంది.

*** ప్రజలు ఓటు వృథా కాకూడదనుకుంటున్నారు**

ఈ మధ్య కాలంలో ప్రజలు ఎన్నికల్లో ప్రతిపక్షం.. అధికార పక్షం వైపే చూస్తున్నారు. మూడో పార్టీకి అంతగా అవకాశం ఇవ్వడం లేదు. తెలంగాణ సహా మరే రాష్ట్రంలోనైనా రెండు పార్టీల మధ్యనే పోరు నడుస్తోంది. ఇప్పుడు ప్రజలు తమ ఓటు వృథా కావద్దనుకుంటున్నారు. కొత్తగా వచ్చిన ఈ మార్పును మనం గమనించాలి. వాళ్ల తీర్పును అర్థం చేసుకోవాలి.

*** జాతీయ నాయకత్వం పేరుతో ఓట్లు అడగాలి**

నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు సోనియా గాంధీని ఎంతగానో గౌరవిస్తారు. కాంగ్రెస్ కార్యకర్తగా నేను సోనియా గాంధీ పేరుతో ఓట్లు అభ్యర్థించా. అలా చేయడం వల్ల పెద్ద ఎత్తున ఓట్లు సాధించాం. భాజపాను చూడండి.. సర్పంచి ఎన్నికలు వస్తే మోదీని సర్పంచి అభ్యర్థిగా చూపెడుతుంది! మున్సిపల్, స్థానిక ఎన్నికలు ఏవైనా కానివ్వండి.. భాజపా వాళ్లు మోదీకి ఓటు వేయండి అని అడుగుతారు. కాంగ్రెస్ ఆ లింక్‌ను మిస్ అవుతోంది. కాంగ్రెస్ లోకల్ నాయకులు ఎంతగానో కష్టపడతారు. కాంగ్రెస్ క్యాడర్ లోకల్ లీడర్ పేరుతో ఓట్లు అడుగుతారు. స్థానిక నాయకులు గట్టిగా పని చేసి జాతీయ నాయకత్వం పేరుతో ఓట్లు అడగాలి. ఉదాహరణకు 'రేవంత్‌రెడ్డికి ఓట్లు వేయండి' అని అడిగితే కొందరు ఆయన రెడ్డి.. ఆయనది అగ్ర కులం అంటారు. బీసీ, ఎస్సీ.. ఇలా రకరకాల సామాజిక భావనలు సృష్టిస్తారు. అదే స్థానిక నాయకులు జాతీయ నాయకత్వం పేరుపై ఓట్లు అడిగితే.. ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ భావనలే రావు. ఇది నా పరిశీలన. కాంగ్రెస్ పార్టీ కూడా ఆ దిశగా ఆలోచించాల్సి ఉంది. ఏ పార్టీకైనా, సంస్థకైనా ముఠాతత్వం (గ్రూపిజం) పనికిరాదు.

*** వేగంగా అభివృద్ధి బాటలు**

భారాస ప్రభుత్వం తెలంగాణ కోసం చేసింది ఏం లేదు. ఆ పార్టీ నాయకులు ఎన్నో వాగ్దానాలు చేశారే తప్ప వాటిని నెరవేర్చలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత.. వేగంగా అభివృద్ధికి బాటలు వేశాం. తెలంగాణను హైదరాబాద్ కోర్ అర్బన్, సెమీ అర్బన్, రూరల్ అనే మూడు జోన్లుగా విభజించి అభివృద్ధి చేస్తున్నాం. గోదావరి నీటిని మూసీలో కలపడం ద్వారా త్రివేణి సంగమంగా మార్చనున్నాం. దేశంలోని ఉత్తర, దక్షిణ, తూర్పు, పడమర దిక్కులకు అనుసంధానమై, దక్షిణాది రాష్ట్రాలకు ముఖ ద్వారంగా ఉన్న తెలంగాణ దేశానికి లాజిస్టిక్ సెంటర్‌గా ఉండాలని మేం ఆకాంక్షిస్తున్నాం. కేంద్ర ప్రభుత్వ తాజా ఆర్థిక సర్వే నివేదిక ప్రకారం.. అతి తక్కువ ద్రవ్యోల్బణం ఉన్న రాష్ట్రం తెలంగాణ. గ్లోబల్ ఏఐ యూసేజ్ రిపోర్ట్ ప్రకారం.. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వినియోగంలో, తలసరి ఆదాయంలోనూ మేం ప్రథమ స్థానంలో ఉన్నాం" అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల ప్రీగ్రౌండింగ్ సమావేశాలకు ఏర్పాట్లు

(మొదటిపేజీ తరువాయి)

* నుంచి ఎలాంటి ఆర్థిక సహాయం అందదు. పునాది పూర్తయిన తర్వాతే మొదటి విడతలో భాగంగా రూ.లక్షను లబ్ధిదారుడి ఖాతాలో జమ చేయనుంది.
* ప్రతి ఇంటికి 8 ట్రాక్టర్ల ఇసుకను అందించాలని నిర్ణయించారు. దీనికి సంబంధించిన కూపన్లను తహసీల్దార్/ఆర్డీవో ద్వారా అందించనున్నారు.
* సిమెంటు, స్టీలు వంటి సామగ్రిని హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా తక్కువ ధరకు అందించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.
* క్షేత్రస్థాయిలో ఏఈ/ఎంపీడీవోలు పర్యటించి ఇంటి నిర్మాణం పూర్తయిన దశను బట్టి లబ్ధిదారుడికి జమ చేసే నగదు కోసం సిఫార్సు చేస్తారు.
* ఇప్పటికే అక్కడక్కడ ప్రీగ్రౌండింగ్ పూర్తి కాగా, మిగతా గ్రామాల్లో ఈ ప్రక్రియను వారం రోజుల్లో పూర్తి చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.
* 21 నియోజకవర్గాల్లో వెయ్యికిగా మంజూరు
* ప్రభుత్వం మొదటి విడతలో 71,482 ఇళ్లను ఇవ్వాలని నిర్ణయించింది. ఇందులో 21 నియోజకవర్గాల్లో వెయ్యికిపైగా ఇవ్వనుంది. అత్యధికంగా హుజూర్‌నగర్ నియోజకవర్గంలో 2,528 ఇళ్లను అందించనుంది. మంథనిలో 1,952, బోథ్ 1,538, పరకాల 1,501, హుస్నాబాద్ 1,381, సిర్పూర్ 1,324, దుబ్బాక 1,271, పరిగి 1,264, బెల్లంపల్లి 1,206 జహీరాబాద్ 1,205, పెద్దపల్లి 1,198, కోదాడ 1,152, చొప్పదండి 1,121, పినపాక 1,113, దేవరకొండ 1,091, ములుగు 1,080, ఆసిఫాబాద్ 1,067, కొడంగల్ 1,046, అందోలు 1,040, తుంగతుర్తి 1,014, గజ్వేల్‌లో 1,001 ఇళ్లను అందించనున్నారు. మిగతా నియోజకవర్గాల్లో వెయ్యిలోపే ఎంపిక చేశారు.

# కోర్టుల్లో అధిక శాతం పిటిషన్లు విడాకులవే..

హైదరాబాద్: విడాకుల కోసం న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్న వారి సంఖ్య పెరుగుతోందని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్ పాల్ అన్నారు. నమోదయ్యే పిటిషన్లలో ఎక్కువ శాతం ఇవే ఉంటున్నాయని పేర్కొన్నారు. వరంగల్ జిల్లాలో ఇటీవల కమ్యూనిటీ మీడియేషన్ కోసం ఏర్పాటు చేసిన సమావేశంలో.. బంధువులు, సన్నిహితుల్లో విడాకుల కేసులు లేని వారు చెయ్యి ఎత్తాలని కోరగా హాజరైన 600 మంది వాలంటీర్లలో కేవలం నలుగురు మాత్రమే చెయ్యి ఎత్తినట్లు చెప్పారు. ఇది ప్రస్తుత పరిస్థితులకు అద్దం పట్టే అనుభవమన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని సంస్కృతి రాజ్‌భవన్ కమ్యూనిటీ హాల్‌లో మూడు రోజుల 'కమ్యూనిటీ మీడియేషన్ వాలంటీర్ల శిక్షణ' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. "వర్గాల వారీగా కమ్యూనిటీ సెంటర్లను ఏర్పాటు చేసి అక్కడే రాజీమార్గంలో కేసులను పరిష్కరించొచ్చు. ఈ విధానం కేరళలో ప్రారంభమైంది. ఆయా వర్గాలకు చెందిన విశ్రాంత అధికారులు, ఉన్నత స్థానంలో ఉన్నవారు ఇందులో భాగస్వాములు అవుతున్నారు. నిజామాబాద్ జిల్లాలో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ సెంటర్ ద్వారా 142 కేసులకు 72, కామారెడ్డిలో 20కి 9 కేసులు పరిష్కారమయ్యాయి. కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్ల ఏర్పాటు, సమస్యల పరిష్కారంపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో మనోవిజ్ఞాన వేత్తలు, నిపుణులు సూచనలు చేస్తారు. వాటిని వాలంటీర్లు తప్పకుండా ఆచరించాలి" అని జస్టిస్ సుజయ్ పాల్ సూచించారు. విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్ మాట్లాడుతూ.. ఇండోర్‌లో 22 కమ్యూనిటీ సెంటర్లు ఏర్పాటు చేయగా కోర్టు బయటే 5 వేలకు పైగా కేసులు పరిష్కారమయ్యాయని తెలిపారు. సమాజంలోని అన్నివర్గాల వారినీ ఇందులో భాగం చేశామన్నారు. వ్యాపార, ధార్మిక సంస్థకు చెందిన వ్యక్తులతోపాటు విలేకరులు, విద్యావేత్తలు, విశ్రాంత ఉన్నతాధికారులు స్వచ్ఛందంగా భాగస్వాములు అవుతున్నారని, హైదరాబాద్‌లో పని చేయడానికి ముందుకొచ్చిన వాలంటీర్లకు అభినందనలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత న్యాయమూర్తి రవికుమార్, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ మెంబర్ సెక్రటరీ పంచాక్షరి, హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్, మీడియేషన్ సెంటర్ డైరెక్టర్ ఏజే జవాద్ తదితరులు పాల్గొన్నారు.

# సోషల్ మీడియా లేని రోజుల్లో జీవితం సింపుల్‌గా ఉండేది

**బాలీవుడ్ సూపర్‌స్టార్ సల్మాన్‌ఖాన్**



దిల్లీ: "సామాజిక మాధ్యమాలు లేని రోజుల్లో ఎవరు ఎక్కడికి పోతున్నారు.. ఎవరితో పోతున్నారో మనకు తెలిసేది కాదు. జీవితం సింపుల్‌గా ఉండేది. ఇపుడు ఫోను చేతిలో ఉండి, ఎవరినైనా ఫాలో చేస్తూ ఉంటే చాలు. మొత్తం సమాచారం మీకు వచ్చేస్తుంది. ఆమె ఎక్కడికి పోతోంది.. ఎవరిని కలుసుకుంటోంది.. ఈ పోస్టు వచ్చింది.. ఆ పోస్టు వచ్చింది.. ఇలా ఆన్‌లైనులో అంతులేని స్క్రోలింగు నడుస్తుంది. ఇదంతా పెద్ద మనోవేదన" అని బాలీవుడ్ సూపర్‌స్టార్ సల్మాన్‌ఖాన్ (59) అన్నారు. తన సోదరుడు అర్బాజ్‌ఖాన్ కుమారుడైన అర్హాన్‌ఖాన్, అతడి మిత్రబృందంతో కలిసి "డంబ్ బిర్యానీ" పాడ్‌కాస్ట్ ముందు కూర్చొన్న సల్మాన్ మనసు విప్పి మాట్లాడారు. అర్హాన్‌కు చెందిన ఈ యూట్యూబ్ ఛానల్‌కు ఫేస్‌బుక్, 'ఎక్స్', ఇన్‌స్టాగ్రాంలలో 16 కోట్ల ఫాలోవర్లు ఉన్నారు. గడిచిపోయిన విషయాలు (బ్యాగేజీ) మోస్తూ బతకొద్దని, వర్తమానంలో జీవించాలంటూ సల్మాన్ యువతకు సూచించారు. జీవితంలో సాధించాలనుకున్న కష్టమైన లక్ష్యాలతో యువత ప్రేమలో పడాలని.. మనసు, శరీరం ఇక వద్దంటున్నా 'కమాన్.. ఒక చివరి ప్రయత్నం' అని కృషి చేయాలన్నారు. నేటి తరం యువతలో తాను ఎప్పటికీ నేర్చుకోలేకపోయే విషయాలు చాలా ఉన్నట్లు తెలిపారు. హిందీలో ధారాళంగా మాట్లాడలేకపోతున్న అర్హాన్ బృందాన్ని సల్మాన్ తప్పుబట్టారు. "మీరు ఎలా మాట్లాడినా మీ హిందీని నేను సరిచేస్తాను. హిందీ తెలియకపోతే సిగ్గుపడాలి. మీరు సేవలు అందించాల్సింది హిందీ ప్రేక్షకులకే" అన్నారు.

## బోనస్ ఇవ్వక రైతులను మోసం చేసిన ప్రభుత్వం

హైదరాబాద్, సిద్దిపేట టౌన్ : కాంగ్రెస్ ప్రభుత్వం సన్నవడ్లకు బోనస్ ఇవ్వకుండా రైతులను మోసం చేస్తోందని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. 48 గంటలు కాదు.. 48 రోజులైనా రైతులకు బోనస్ డబ్బులు రాలేదని, ప్రభుత్వం, ఉత్తమ్ మాటలు ఉత్తరకుమార ప్రగల్భాలే అయ్యాయని దుయ్యబట్టారు. సన్నవడ్ల బోనస్‌కు సంబంధించిన రూ.432 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి ఆదివారం హరీశ్‌రావు బహిరంగ లేఖ రాశారు. ఆ లేఖను ప్రదర్శిస్తూ సిద్దిపేటలో ఆయన విలేకరులతో మాట్లాడారు. "వరి ధాన్యం కొనుగోళ్లను నిలిపివేసి 50 రోజులు గడిచిపోతున్నాయి. ఇంతవరకు రైతుల ఖాతాల్లో బోనస్ డబ్బులు జమ కాలేదు. రెండో పంటకు సిద్ధం కావాల్సిన రైతులు ఆ డబ్బుల కోసం అధికారుల చుట్టూ తిరగడం దురదృష్టకరం. ఎన్నికల ముందు అడిగిందల్లా ఇస్తామని కోతలు కోసిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు అన్నింటికీ కోతలు పెడుతోంది. కందులకు బోనస్ ఇస్తామని చెప్పి కోత కోశారు. రాష్ట్ర రైతులు 10 లక్షల ఎకరాల్లో కంది పంటను సాగుచేస్తే వ్యవసాయ శాఖ మాత్రం 4 లక్షల ఎకరాలలోపు సాగు అయిందని నమోదు చేయడం విడ్డూరం. ప్రభుత్వ తప్పిదానికి రైతులు బలి కావాలా? పొద్దుతిరుగుడు పంట దిగుబడి వచ్చినా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించలేదు" అని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందని, ఆ రంగంలో జరుగుతున్న ఆత్మహత్యలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని హరీశ్ డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ యాదవరెడ్డి, భారాస నాయకులు మనోహర్‌రావు, రాజనర్సు, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## కె.కె.లైన్ విషయం రైల్వేమంత్రి దృష్టికి తీసుకెళ్లాం

(మొదటిపేజీ తరువాయి)

విలేకరులు ఆమె దృష్టికి తేగా.. ఈ విషయాన్ని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. విశాఖ డివిజన్‌లో కె.కె.లైన్ ఉండేలా కృషి చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సౌత్ ఇన్‌ఛార్జి వాసుపల్లి సంతోష్‌కుమార్ భాజపాలో చేరారు. ఆయనకు పురందేశ్వరి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఏడు నెలల్లో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి రూ.3 లక్షల కోట్లు వివిధ రూపాల్లో అందించిందని ఆమె తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు రూ. 11,440 కోట్లు కేటాయించి ప్రధాని ఊపిరి పోశారని.. రాజధాని అమరావతికి ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు నుంచి రూ. 15 వేల కోట్లు, హడ్కో నుంచి రూ. 11 వేల కోట్లు వస్తున్నాయని తెలిపారు. విశాఖ ఉత్తరం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, పార్టీ నేతలు కాశీవిశ్వనాథరాజు, పరశురామరాజు తదితరులు పాల్గొన్నారు. దిల్లీ ఎన్నికల్లో పార్టీ విజయం సాధించడాన్ని పురస్కరించుకొని బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

## పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండండి

(మొదటిపేజీ తరువాయి)

సారించాలి తప్ప, సమాజానికి ప్రయోజనం లేని వ్యక్తిగత అంశాలపై కాదని అధినేత స్పష్టం చేసినట్లు పేర్కొన్నారు. మరోవైపు, కిరణ్ రాయల్ తిరుపతి అడిషనల్ ఎస్పీ రవిమనోహరాచారిని కలిసి తనపై ఆరోపణలు చేసిన మహిళతో పాటు సామాజిక మాధ్యమాల్లో ప్రసారం చేసిన వారిపై కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేశారు.

**కిరణ్ బెదిరించారంటూ మహిళ ఫిర్యాదు**

తిరుపతి జనసేన ఇన్‌ఛార్జి కిరణ్ రాయల్ తనను, తన ఇద్దరు కుమారులను చంపేస్తానని బెదిరించారని సదరు మహిళ ఆదివారం రాత్రి ఎస్వీయూ పోలీసులను ఆశ్రయించారు. తనకివ్వాల్సిన రూ.1.20 కోట్లు ఇప్పించడంతోపాటు ప్రాణరక్షణ కల్పించాలని కోరారు.

## పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండండి

(మొదటిపేజీ తరువాయి)

సారించాలి తప్ప, సమాజానికి ప్రయోజనం లేని వ్యక్తిగత అంశాలపై కాదని అధినేత స్పష్టం చేసినట్లు పేర్కొన్నారు. మరోవైపు, కిరణ్ రాయల్ తిరుపతి అడిషనల్ ఎస్పీ రవిమనోహరాచారిని కలిసి తనపై ఆరోపణలు చేసిన మహిళతో పాటు సామాజిక మాధ్యమాల్లో ప్రసారం చేసిన వారిపై కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేశారు.

**కిరణ్ బెదిరించారంటూ మహిళ ఫిర్యాదు**

తిరుపతి జనసేన ఇన్‌ఛార్జి కిరణ్ రాయల్ తనను, తన ఇద్దరు కుమారులను చంపేస్తానని బెదిరించారని సదరు మహిళ ఆదివారం రాత్రి ఎస్వీయూ పోలీసులను ఆశ్రయించారు. తనకివ్వాల్సిన రూ.1.20 కోట్లు ఇప్పించడంతోపాటు ప్రాణరక్షణ కల్పించాలని కోరారు.

## ప్రజల కోసం పనిచేయండి.. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలతో కేజ్రీవాల్

(మొదటిపేజీ తరువాయి)

దిల్లీలోని ఫిరోజ్‌షా రోడ్‌లోని తన నివాసంలో ఆయన ఆదివారం కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలతో సమావేశమయ్యారు. ఈ భేటీలో ఆతిశీతో పాటు 22 మంది ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. అనంతరం ఆతిశీ విలేకరులతో మాట్లాడుతూ.. భాజపా ఇచ్చిన హామీలను నెరవేర్చేలా ఆప్ నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్రను పోషిస్తుందని అన్నారు. ప్రజల కోసం పనిచేస్తూ.. వారి సమస్యల్ని పరిష్కరిస్తామని తెలిపారు.

## సౌదీ గిగా ప్రాజెక్టు 'దిరియా'పై టాటా, ఓబరాయ్ ఆసక్తి

దిల్లీ/దావోస్: సౌదీ అరేబియాలో 63 బిలియన్ డాలర్ల (సుమారు రూ.5.48 లక్షల కోట్ల) పెట్టుబడి అంచనా వ్యయంతో నిర్మిస్తున్న 'సౌదీ అరేబియాలో 63 బిలియన్ డాలర్ల' గిగా ప్రాజెక్టులో పలు భారతీయ సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి ప్రదర్శిస్తున్నట్లు ప్రాజెక్ట్ సీఈఓ జెర్రీ ఇంజెరిల్లో వెల్లడించారు. టాటా, ఓబరాయ్ వంటి పెద్ద పెట్టుబడి సంస్థలు ఇప్పటికే ఇందుకోసం ఒప్పందం చేసుకున్నట్లు వివరించారు. 'సిటీ ఆఫ్ ఎర్త్'గా పిలుస్తున్న 'దిరియా' ప్రాజెక్టును సౌదీ అరేబియా రాజధాని రియాద్ శివార్లలో నిర్మిస్తున్నారు. లక్ష మంది ప్రజలు నివసించేందుకు అనువైన ఇళ్లు.. మరో లక్ష మంది పని చేసేందుకు అనువైన కార్యాలయ స్థలాన్ని ఈ గిగా ప్రాజెక్టులో అభివృద్ధి చేయనున్నారు. దిరియా నగరంలో 40కి పైగా విలాసవంత హోటళ్లు, 1,000కి పైగా షోరూంలు, 150కి పైగా రెస్టారెంట్లు, కేఫ్‌లు, ఒక విశ్వవిద్యాలయం, ఆర్ట్స్/కల్చరల్ ఆస్తులు, మ్యూజియంలు, ఒపెరా హౌస్, పలు రకాల కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు 20,000 సీట్ల సామర్థ్యంతో ఎరీనా, గోల్ఫ్ కోర్స్, ఇంటర్నేషనల్ ఈక్వెస్ట్రియాన్, పోలో సెంటర్ తదితర సదుపాయాలు ఉండనున్నాయి. ఆధునిక సౌదీ రాజ వైభవాన్ని చాటేలా, ఈ 63 బి.డాలర్ల స్థిరాస్తి అభివృద్ధి, పర్యాటక ప్రాజెక్టును తలపెట్టారు.

# ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుంది

*** కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. ఆదివారం నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో 30 వ డివిజన్ లో ఏనుగుల వారి కుటుంబ సభ్యుల ఆద్వర్యంలో శ్రీశ్రీశ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి , శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయ 124వ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ వార్షికోత్సవ వేడుకలకు కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్, మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ లు ముఖ్య అతిధులుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ మాట్లాడుతూ ప్రతీ ఏటా జరిగే శ్రీశ్రీశ్రీ భ్రమరాంబా మల్లికార్జున రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం భక్తుల ఐక్యతా, ఆధ్యాత్మిక శ్రద్ధకు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు లీడర్ నర్సింహా రెడ్డి, మాజీ కార్పొరేటర్లు బొర్రా దేవి చందు ముదిరాజ్, పెద్దిరెడ్డి సుజాత, మాజీ కోఆప్షన్ సభ్యులు ఏనుగుల అభిషేక్ రెడ్డి, చంద్రగిరి జ్యోతి సతీష్, నాయకులు సాంబాశివా రెడ్డి, దశరథ్, ముత్యాలు, దండుగుల స్వామి, ఏనుగుల రాజశేఖర్ రెడ్డి, విష్ణు, ఎన్ఎంసి మహిళా అధ్యక్షురాలు అర్పిత ప్రకాష్, ఆలయ కమిటీ సభ్యులు ఏనుగుల కృష్ణ రెడ్డి, ఏనుగుల నర్సింహా రెడ్డి, ఏనుగుల సత్తి రెడ్డి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# రాజయోగ ధ్యానం మనస్సును ప్రశాంతంగా ఉంచి, ఒత్తిడిని తగ్గించడానికి ముఖ్యమైన సాధనం

*** కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : రాజయోగ ధ్యానం మన మనస్సును ప్రశాంతంగా ఉంచి, ఒత్తిడిని తగ్గించడానికి ముఖ్యమైన సాధనమని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. ఆదివారం రోజు ప్రగతి నగర్ పరిధిలోని రాఘవేంద్ర హోమ్స్ లో ప్రజాపిత బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో నూతన రాజయోగ మెడిటేషన్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ హాజరై కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ మాట్లాడుతూ సమాజంలో నీతి, శాంతి, సామరస్యాన్ని నెలకొల్పడంలో బ్రహ్మకుమారీస్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. బ్రహ్మకుమారీస్ సీనియర్ గైడ్‌లు రాజయోగ ధ్యానానికి సంబంధించిన వివరణాత్మక వివరాలను అందించి, ధ్యానం ద్వారా ఆధ్యాత్మిక పురోగతి, మానసిక ప్రశాంతత, ఆరోగ్యకరమైన జీవన విధానంపై పలు విషయాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, నాయకులు జస్వంత్, సాంబశివారెడ్డి, అజయ్ చౌదరి, స్వామి, బిక్షపతి, వై ఎస్ ఆర్, ముత్యాలు, మహిళా నాయకులు అర్పిత ప్రకాష్, లలితా రెడ్డి, పద్మ , బ్రహ్మకుమారీస్ దిల్ రెడ్డి బయ్య, రాజ యోగిని బి.కె. సరోజినీ, రాజ యోగిని బి.కె. జ్యోతి, బి.కె. గణేష్, బి.కె. నాందేవ్, బి.కె. నరేందర్ సభ్యులు పాల్గొన్నారు.

# నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ను ఒక మోడల్ కార్పొరేషన్ గా తీర్చిదిద్దాం

*** కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : గత పదేళ్ల బిఆర్ఎస్ హయంలో నిజాంపేట్ నీ మున్సిపల్ కార్పొరేషన్ గా ఏర్పాటు చేసుకొని ఎన్నో అభివృద్ధి పనులను పూర్తి చేసుకొని ఒక మోడల్ కార్పొరేషన్ గా తీర్చిదిద్దామని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 17వ వార్డులో స్థానిక కార్పొరేటర్ ఆగం రాజుకి ఆదివారం కౌసల్య కాలనీ సంక్షేమం సంఘం వారు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక ఆగం రాజు డివిజన్ లోని ప్రతి సమస్యని తన దృష్టికి తీసుకువచ్చి డివిజన్ అభివృద్ధికి పాటు పడి ప్రజలకు మరింత చేరువయ్యారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు చందు ముదిరాజ్, బొబ్బా శ్రీను, దశరథ్, ప్రదీప్, సాంబశివారెడ్డి, అజయ్ చౌదరి, వైయస్సార్, అర్పితా ప్రకాష్, 17వ వార్డు యూత్ అధ్యక్షులు బద్రి, కాలనీ వాసులు ఆకుల చందు, నరేష్, సురేష్, దినేష్, అన్వేష్, సుజాత, మల్లేష్, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

# 317 జీవో కు వ్యతిరేకంగా పోరాడింది బిజెపి

*** కేంద్ర సహాయ శాఖ మంత్రి బండి సంజయ్**



ప్రజాస్ఫూర్తి, నల్లగొండ : 317 జీవో కు వ్యతిరేకంగా పోరాడింది బిజెపి పార్టీనే అని, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఆదివారం నల్లగొండ జిల్లా బిజెపి పార్టీ కార్యాలయంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం మూడు ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్నాయని, పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈనెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్, బిఆర్ఎస్ రెండు పార్టీలు రూపాయి కారి ఒప్పందం కుదుర్చుకున్నాయని విమర్శించారు.అధికార కాంగ్రెస్ పార్టీకి ఎమ్మెల్సీ అభ్యర్థులే కరువు కాగా, టిఆర్ఎస్ గురించి పట్టించుకునే వారే లేరని ఆవేదన వ్యక్తం చేశారు. అధికార పార్టీకి అభ్యర్థులు లేకపోవడం దేశంలోనే తెలంగాణ లోనే ఈ పరిస్థితి ఉంది. బిజెపి పార్టీని గెలవనివ్వకుండా రెండు పార్టీలు ఒప్పందం కోల్చుకున్నాయని అందరికీ తెలిసిందేనన్నారు. కాలేశ్వరం కేసు, ఫోన్ టాపింగ్, డ్రగ్స్ ఫామ్ హౌస్, ఈరేస్ ఫార్ములా కేసులలో పార్టీ నేతలు ఎవరిని అరెస్ట్ చేయలేదని, ప్రధాన కారణం ఒప్పందమైన అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో కాంగ్రెస్కు ఎందుకు ఓటేయాలో చెప్పాలని డిమాండ్ చేశారు నిరుద్యోగ భృతి నాలుగు వేలు ఇస్తానని చెప్పిన హామీ, లక్షల ఉద్యోగుల హామీ ఏమైందో స్పష్టం చేయాలన్నారు ఫీజు రియంబర్స్మెంట్ కింద ప్రైవేటు కాలేజీకి యాజమాన్యాలకు ఇప్పటికే సుమారు రూ.7000 కోట్లు ఇవ్వాలన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగులకు పిఆర్సి ప్రకటిస్తామని, ఇంతవరకు దాని మూస పెట్టడం లేదన్నారు. విద్యాశాఖలో రెగ్యులర్ ఎంఈఓ డిఈఓ లేకపోవడమే కాకుండా అసలు విద్యాశాఖ మంత్రి లేకపోవడం హాస్యస్పదమన్నారు.. విద్యా వ్యవస్థ ప్రస్తుతం అర్బన్ నక్షత్ చేతిలో ఉందని విమర్శించారు. మూర్ఖుడైన కేసీఆర్ 317 జీవో తీసుకువస్తే దానివల్ల దాదాపు 20 మంది ఉద్యోగులు చనిపోయారని, ఆ జీవన రద్దు చేయాలని బిజెపి, తపస్ పోరాడింది అన్నారు. బీసీ కులగరణ తప్పులతడక అంటూ విమర్శించారు. ముస్లింలను బీసీలలో ఎలా కలుపుతారని ఆయన సీఎంను ప్రశ్నించారు ఓట్ల కోసమే ఓవైసీ కుటుంబం రేవంత్ రెడ్డి గ్యాంగ్ కలిసి చేసిన కుట్ర అని ఆయన విమర్శించారు. ముస్లింలను బీసీలుగా చేరిస్తే బీసీ మంత్రులు ఎలా ఒప్పుకున్నారని ఆయన ప్రశ్నించారు. ఢిల్లీ ఎన్నికలలో మేధావులంతా కలిసి బిజెపిని గెలిపించారని పేర్కొన్నారు అదేస్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న ముగ్గురు ఎమ్మెల్సీ అభ్యర్థులు గెలిపించాలని ఆయన కోరారు.. ఈ విలేకరుల సమావేశంలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు. మనోహర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, ఎస్ సి మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొండేటి శ్రీధర్, కాసం వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ అభ్యర్థి సర్వోత్తమ రెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీరెల్లి చంద్రశేఖర్, నివేదిత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలి

*** ఎండి బాబా షరీఫ్**




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా నాయకులు కార్యకర్తలు పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం స్థానిక ఎన్నికల ఇన్చార్జి యండి బాబషరిఫ్ అన్నారు. చౌటుప్పల్ మండలం దేవలమ్మ నాగారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు జక్క సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా స్థానిక ఎన్నికల ఇన్చార్జిలు ఎండీ బాబషరీఫ్, కానుగు శేఖర్, ఊడుగు వెంకటేశం గౌడ్, ఎండీ ఏజాష్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించామన్నారు. ప్రభుత్వం చేసే అభివృద్ధి సంక్షేమ పథకాలు గడపగడపకు తీసుకెళ్లాలన్నారు. గత ఎన్నికల్లో కార్యకర్తల ఏ విధంగా కష్టపడి పనిచేశారో, రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో కూడా శక్తి వంచన లేకుండా పనిచేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ముఖ్య నాయకులు వరకాంతం జంగారెడ్డి సురుగు శ్రీనివాస్ గౌడ్, వర్కాల మహేందర్, రాసాల జంగయ్య, బొమ్మ మైసయ్య, సురుగు మల్లేష్ గౌడ్, షేక్ అజరత్, బొమ్మ లింగస్వామి, బొమ్మ తిరుమల్, షేక్ జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి హోమ్స్ లో జాతర కన్వెన్షన్ హాల్ ప్రారంభం



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : జీడిమెట్ల డివిజన్‌లోని గోదావరి హోమ్స్, సుచిత్ర రోడ్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన "జాతర కన్వెన్షన్ హాల్ ను ఆదివారం కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ప్రాంతంలో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ఈ కన్వెన్షన్ హాల్ ప్రారంభం కావడం హర్షణీయమన్నారు. పెళ్లిళ్లు, శుభకార్యాలు, ఇతర కార్యక్రమాల కోసం ఇది ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుంది. ఇలాంటి ఆధునిక వేదికలు అభివృద్ధి చెందడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కుంట సిద్ధిరాములు, సుధాకర్ గౌడ్, సమ్మయ్య నేత, నరేందర్ రెడ్డి, కాలే నాగేష్, కాలే గణేష్, బాల మల్లేష్ , నిర్వాహకులు, బంధు మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీ శ్రీ శ్రీ కట్ట మైసమ్మ తల్లి జాతర

*** అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని సూరారం గ్రామంలో జరిగిన శ్రీ శ్రీ శ్రీ కట్ట మైసమ్మ తల్లి జాతర ఆదివారం అంగరంగా వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ వేడుకలకు బి.ఆర్.ఎస్. పార్టీ విప్, ఎమ్మెల్యే కే.పి.వివేకానంద్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అమ్మవారి కృపతో ప్రజలు సుభిక్షంగా, ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం భక్తులతో మాట్లాడి, వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. జాతరను విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ మన్నె రాజు, నాయకులు వారాల వినోద్, రాఘవరెడ్డి, యాదిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సాయి గౌడ్, వెంకటస్వామి, రాజ్ కుమార్,దొడ్ల శ్రీనివాస్, గుబ్బల లక్ష్మీనారాయణ, ఆంజనేయులు, వెంకటేష్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామ పెద్దలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అక్రమంగా మద్యం అమ్మితే చర్యలు తప్పవు

*** చౌటుప్పల్ సీఐ మన్మ కుమార్**




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: కిరాణం, వివిధ దుకాణాలలో అనుమతులు లేకుండా అక్రమంగా మద్యం అమ్మకాలు చేస్తే చర్యలు తప్పవని చౌటుప్పల్ సిఐ మన్మధ కుమార్ హెచ్చరించారు. చౌటుప్పల్ మున్సిపల్ మండలంలోని పలు గ్రామాలలో ఆదివారం తనిఖీలు నిర్వహించారు. చౌటుప్పల్ మున్సిపల్ పరిధి లింగోజిగూడెం గ్రామానికి చెందిన పిట్టల నర్సింహ్మా వద్ద రూ.5వేల విలువైన మద్యం పట్టుకున్నారు. అదేవిధంగా మండలంలోని అంకిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన టి లింగయ్య వద్ద దాదాపు 8లీటర్ల క్వాటర్లను పట్టుకున్నారు. పట్టుకున్న మద్యం బాటిళ్ళను సీజ్ చేశారు. అక్రమ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని, వారిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

# కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కు ఘన స్వాగతం



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ బిజెపి మున్సిపల్, మండల కమిటీల ఆధ్వర్యంలో హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కు ఆదివారం చౌటుప్పల్ లో ఘన స్వాగతం పలికారు. వరంగల్ ఖమ్మం నల్గొండ ఉపాధ్యాయ అధ్యాపక సంఘాల ఉమ్మడి ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సరోతం రెడ్డి నామినేషన్ సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ గంగిడి మనోహర్ రెడ్డిలు నల్లగొండకు వెళ్లారు. మార్గమధ్యంలో చౌటుప్పల్ లో బిజెపి శ్రేణులు పూలమాలలు శాలువాలతో ఘనంగా స్వాగతం పలికారు. అదేవిధంగా దేశ రాజధాని ఢిల్లీలో బిజెపి విజయ దుందుభి మోగించడం పట్ల స్వీట్లు తినిపించుకున్నారు. అనంతరం అంకిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన పర్నె సంతోష్ రెడ్డితో పాటు పలువురు బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తలు బండి సంజయ్ కుమార్ సమక్షంలో బిజెపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మునుగోడు నియోజకవర్గ కన్వీనర్ దూడల భిక్షంగౌడ్, మున్సిపల్ అధ్యక్షురాలు కడారి కల్పన ఐలయ్య యాదవ్, మండల అధ్యక్షుడు కైరంకొండ అశోక్ నేత, జిల్లా ఉపాధ్యక్షుడు రమణ గోని శంకర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కంచర్ల గోవర్ధన్ రెడ్డి, మాజీ కౌన్సిలర్స్ పోలోజు శ్రీధర్ బాబు, ఆలె నాగరాజు, ఆలె చిరంజీవి, గుజ్జుల సురేందర్ రెడ్డి, బత్తుల జంగయ్య గౌడ్, ముత్యాల భూపాల్ రెడ్డి, కడారి ఐలయ్య యాదవ్, చినుకని మల్లేష్ యాదవ్, రాధారపు సత్తయ్య, దిండు భాస్కర్, పప్పు వంశీ, రంగయ్య, దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## కార్పొరేటర్ కు ఘన సన్మానం



బొడుప్పల్, (ప్రజాస్ఫూర్తి) : బోడుప్పల్ నగర పాలక సంస్థ 14వ డివిజన్ కార్పొరేటర్ గా కిరణ్ కుమార్ రెడ్డి ఐదు సంవత్సరాలు విజయవంతంగా బాధ్యతలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం డివిజన్ పరిధిలోని ఆర్ఎన్ఎస్ రాయల్ మెడల్స్ కాలనీవాసులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నటువంటి కాలనీని 100 శాతం డ్రైనేజీ, సిసి రోడ్లు వేసి పార్కులతో సహా అభివృద్ధి చేయడానికి నిధులు మంజూరు చేసి కేవలం ఐదు సంవత్సరాల కాలంలో 0 నుండి 100 శాతం తీసుకువెళ్లినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కాలనీవాసులందరూ సకుటుంబ సమేతంగా హాజరై కాలనీ కమ్యూనిటీ హాల్లో కిరణ్ కుమార్ రెడ్డి దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు జలంధర్ రెడ్డి, శరత్, నరేందర్ రాజు, ప్రవీణ్ రెడ్డి, కార్తీక్, వేణు తదితరులు పాల్గొన్నారు.

## మెకల యాదగిరి రెడ్డి కి శుభాకాంక్షలు




పీర్జాడిగూడా, (ప్రజాస్ఫూర్తి) : పీర్జాడిగూడా మల్లికార్జున నగర్ స్వరాజ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఎన్నికైన మెకల యాదగిరి రెడ్డి కి పలువురు కాలనీ వాసులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీ నాయకత్వంలో మా సమాజం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం మెకల యాదగిరి రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో భాగంగా నాకు మద్దతుగా నిలిచిన మాసయ్యగౌడ్, నాగభూషణం గౌడ్, శ్రీహరి, వెంకటేష్, రామకృష్ణ, అనిల్ రెడ్డి, మోహన్ రెడ్డి, ఎవిబి చారి, సర్వేశ్, దర్మయ్య ఒగ్గు, బాల్‌రాజ్, శ్రీనివాస్ , కార్యవర్గ సభ్యులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రతి కాలనీవాసి తమ అండదండలతో నన్ను ఆదరించినందుకు హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలిపారు.

## ఉచిత మెగా వైద్య శిబిరానికి మంచి స్పందన





కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి ) : కూకట్ పల్లి రాం దేవ్ రావు ఆసుపత్రిలో ఆదివారం రాందేవ్ రావు మెడికల్ డైరెక్టర్ డాక్టర్ కె.కమలాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెడ, వెన్ను నొప్పి, స్పైన్ కు సంబందించిన మెగా వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ఈ వైద్య శిబిరంలో ప్రముఖ రేఖి థెరపీ గ్రాండ్ మాస్టర్ లక్ష్మి కమలాకర్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాందేవ్ రావు హాస్పిటల్ సమాజానికి సేవ చేయడానికి ఎప్పుడు ముందుంటుందన్నారు. పేద ప్రజలకు వైద్య సేవలను మరింత అందుబాటులో తీసుకురావడం కోసం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతం అయ్యిందని తెలియజేయడానికి సంతోషిస్తున్నామన్నారు. రాందేవ్ రావు ఆసుపత్రి యాజమాన్యం తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ వైద్య శిబిరం లో సుమారు 400 మంది మెడ , వెన్నునొప్పి సమస్యలతో బాధపడుతున్న వారికి ఎంఆర్ ఐ , సీటీ, ఇతర రక్త పరీక్షలు ఉచితంగా చేశారు. ఈ స్పైన్ క్యాంపు నందు డాక్టర్ హిమాన్షు ఆర్ ప్రసాద్, వెన్నుపూస సమస్యలతో బాధపడుతున్న రోగులకు ప్రత్యేకమైన చికిత్స ను , వైద్య సలహాలు ఇచ్చారు. ఈ క్యాంపు లో డాక్టర్ రాజేష్ సుంకర (ఆర్థోపెడిషన్ ), డాక్టర్ పవన్ (ఫిజిఓథెరపిస్ట్ ),డాక్టర్ మని కుమార్, డాక్టర్ జుబేర్, డాక్టర్ సత్యనారాయణ, భవానంద్ (ఓ టీ టెక్నీషియన్ ), అడ్మిన్ మేనేజర్స్, విక్రందేవ్ రావు, మీరా రావ్, అపర్ణ రావ్, ప్రశాంత్ రెడ్డి, హాస్పిటల్ సిబ్బంది , కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి నల్లగొండ జిల్లాలో
# యాదాద్రి భువనగిరి జిల్లాలోనూ చిన్న చూపు

* జెడ్పీ చైర్మన్ పదవి విషయంలో బీసీలకు అన్యాయం
* ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ నెరవేరుస్తూ ఈసారి న్యాయం జరగాలి



రాజాపేట, ప్రజాస్ఫూర్తి : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు బీసీలకు న్యాయం జరిగే కార్యక్రమంలో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా జడ్పీ చైర్మన్ పదవి వచ్చే ఎన్నికల్లో బీసీలకే కేటాయించాలని అన్ని పార్టీల బిసి నాయకులు ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు. ఓసిలతో సమానంగా అంతకంటే ఎక్కువగా వివిధ పార్టీల బీసీ నాయకులు స్వచ్ఛంద సంస్థల వారు ప్రజలకు ఎనలేని సేవలందిస్తూ జెడ్పి చైర్మన్ పదవి కోసం ఆశపడి ఎదురు చూసి అనేకమంది బీసీ నేతలు నిరాశకు గురయ్యారు. ఇంకా గురవుతూనే ఉన్నారు. బీసీలకు పట్టం కడతాం, వారి జనాభా ప్రాతిపదికన గుర్తిస్తాం, అవసరమైన పదవులను అందించి గౌరవిస్తామని చెబుతూ కేవలం మైకులకు పేపర్లకే పరిమితమైనట్లు ఉన్న ఆరోపణలను నిజం కాదని నిరూపిస్తూ బీసీలకు జెడ్పి చైర్మన్ పదవి దక్కే విధంగా రిజర్వేషన్ అమలు చేయాల్సిన అవసరం ఉంది. యాదాద్రి భువనగిరి జిల్లాలో ఉన్న 17 మండలాల్లో ఎక్కువ మండలాలు 8 ఉన్న ఆలేరు నియోజకవర్గం నుండి జెడ్పి చైర్మన్ ను ఎంపిక చేసుకుంటే పార్టీకి గౌరవంతో పాటు బీసీ ప్రజల్లో నాయకుల్లో నమ్మకం ఏర్పడుతుంది. అదే సమయంలో అనేక సంవత్సరాలుగా ప్రజలకు పార్టీకి సేవలు అందిస్తున్న బీసీ నేతలకు సరైన గౌరవం దక్కినట్లు అవుతుంది. బిసి నాయకులలో సర్పంచ్ ల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీర్ల శంకర్ నిత్యం ప్రజల్లో ఉంటూ సేవలందిస్తూ సమస్యలు పరిష్కారం చేస్తూ ఆలేరు నియోజకవర్గంలోనే మొదటి వరుసలో ఉన్నారు. తనదైన శైలిలో నియోజకవర్గంలోని తన పనిచేస్తులతో పార్టీ కార్యకర్తలు నాయకులతో తన సోదరుడు బీర్ల ఐలయ్య నియోజకవర్గ రికార్డు స్థాయిలో 50వేల మెజార్టీ గెలుపు కోసం కృషి చేసిన వారిలో మొదటి స్థానంలో బీర్ల శంకర్ నిలిచారు. యాదాద్రి భువనగిరి జిల్లా జడ్పీ చైర్మన్ రిజర్వేషన్ బీసీలకు కేటాయిస్తే బిర్లా శంకర్ తోపాటు అధికార కాంగ్రెస్ పార్టీలో, ఇతర పార్టీలలో బీసీ నాయకులు సేవ చేసే వ్యక్తులు సంతోషం వ్యక్తం చేస్తూ జిల్లా ప్రజలకు మరింత సేవ చేసే భాగ్యం కలుగుతుందని తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తారు. అందులో ఆలేరు నియోజకవర్గం కు ఆకాశం ఇస్తే అధిక మండలాలు ఉన్న నియోజకవర్గానికి ప్రాధాన్యత కలిగించినట్లు అవుతుందని సంపూర్ణ న్యాయం జరుగుతుందని ప్రేమ ఒక్కటే నియోజకవర్గ బీసీ ప్రజలు నాయకులు సంతోషం వ్యక్తం చేస్తారు. అధికార కాంగ్రెస్ పార్టీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అని కూడా పార్టీలకతీతంగా అభినందిస్తారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో ఆలేరు నియోజకవర్గంలో 8 జెడ్పిటిసిలు భువనగిరి నియోజకవర్గం లో నాలుగు తుంగతుర్తికి 2 రామన్నపేటకు చెందిన ఒక జెడ్పిటిసి మునుగోడు నియోజకవర్గంలో ఒకటి జెడ్పిటిసి స్థానాలు ఉన్నాయి. జెడ్పీ చైర్మన్ బీసీకి కేటాయిస్తూ ఈ క్రమంలో అధిక ఓట్లు అధిక సీట్లున్న ఆలేరు నియోజకవర్గం కు అవకాశం ఇచ్చి ఆలేరు బీసీ నాయకులకు గౌరవించాల్సిన అవసరం ఉంది. ఉన్నత పదవులన్నీ భువనగిరి నియోజకవర్గానికి గతంలో రావడం జరిగింది ఈసారి ఆలేరుకు అవకాశం వస్తే ప్రజలకు సేవ చేయడానికి తాను ముందున్నానని బిర్లా శంకర్ తెలిపారు. జిల్లా పరిషత్ చైర్మన్ పదవి ఈసారి బీసీలకే కేటాయించాలని, ఉమ్మడి నల్లగొండ జిల్లా నుండి బీసీలకు ప్రాధాన్యత తగ్గడమే కాకుండా తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఉన్నత పదవులన్నీ భువనగిరి నియోజకవర్గానికి చేకూర్చడం జరిగింది ఈసారైనా జిల్లా పరిషత్ చైర్మన్ పదవి ఆలేరు నియోజకవర్గం కేటాయించాలని నియోజకవర్గ ప్రజలు కోరుకుంటున్నారు. ఆలేరు నియోజకవర్గ మొత్తం 8 మండలాలు ఉన్నాయి అత్యధికంగా అక్కడి నుండే జిల్లా పరిషత్ చైర్మన్ కు ఓట్లు వేయాల్సి ఉంటుంది జిల్లా పరిషత్ చైర్మన్ పదవి కూడా ఆ నియోజకవర్గానికి ఇస్తేనే బాగుంటుందని ఆ మండలాల వారి వాదన.

# పరీక్షలు అంటే ఆందోళన వద్దు

**: జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: విద్యార్థులు పరీక్షలు అంటే ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు.ఆదివారం కొత్తగూడెంలోని అంబేద్కర్ భవన్ లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బీసీ సంక్షేమ వసతి గృహాలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు పరీక్ష ప్రేరణ, శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థిని,విద్యార్థులు పదవ తరగతి వార్షిక పరీక్షలకు సమయం దగ్గర పడుతున్నందున కష్టపడి చదవాలని మంచి మార్కులు తెచ్చుకోవాలని సూచించారు. పరీక్ష వ్రాసే విధానాన్ని విద్యార్థిని విద్యార్థులకు తెలపాలని ఉపాధ్యాయులకు సూచించారు. పరీక్షల కు ప్రశాంతంగా చదువుకోవాలని, మానసికంగా ఆందోళన చెందకుండా సిద్ధపడాలని కోరారు. ఇప్పుడు ఉన్న 40 రోజుల సమయం మంచి సమయమని సబ్జెక్టు వారీగా ప్రతిరోజు రివిజన్ చేసుకోవాలని, గత సంవత్సర ప్రశ్నపత్రాలు విశ్లేషించుకోవాలని, పాఠ్యాంశాలు మరొకసారి పునఃశ్చరణ చేసుకోవాలని, అయన తెలియజేశారు. విద్యార్థినీ విద్యార్థులకు వార్షిక పరీక్షల సామాగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమ అధికారిని ఇ.ఇందిర, విషయ నిపుణులు మీరా హుస్సేన్, బిఎస్ఎన్ రెడ్డి, మోహన్ రావు, సైదులు, సైకాలజీ నిపుణులు వెంకటేశ్వర బాబు, వసతి గృహ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

## సాగునీరు విషయంలో జాప్యం చేయొద్దంటూ బీర్ల ఐలయ్యకు రైతు జేఏసీ వినతి




రాజాపేట, ప్రజాస్ఫూర్తి : గత 26 రోజుల నుండి రాజపేట మండల రైతు జేఏసీ ఆధ్వర్యంలో సాగునీటి కోసం నిరసన కార్యక్రమాలు తెలియజేస్తూ ఆదివారం రాజపేట గ్రామంలో రైతు జేఏసీ తరపున ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకి రైతులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ ఎర్రగోకల జశ్వంత్, టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్, పిఏసిఎస్ వైస్ చైర్మన్ కాకర్ల ఉపేందర్, రాజపేట పట్టణ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బెడిదే వీరేశం, టిఆర్ఎస్ మండల పార్టీ సెక్రటరీ జనరల్ సందిల భాస్కర్ గౌడ్, యాదాద్రి భువనగిరి జిల్లా మాజీ ప్రజాప్రతినిధుల ఫోరం జిల్లా అధ్యక్షులు బొంగోని ఉప్పలయ్య గౌడ్, బిజెపి నాయకులు జన్న సిద్ధులు, అంకతి వెంకటేష్, రేగు ఎల్లయ్య, హమాలి సంఘం అధ్యక్షుడు రేగు శ్రీశైలం, బండి సిద్ధులు, బుగ్గ నరసింహులు, కర్రె కిష్టయ్య, ఎమ్మ బాలరాజు, గౌడ బాలరాజు, దయ్యాల రవి, గొల్లన రవి, కొమురయ్య, బాలయ్య, నర్సింలు వివిధ గ్రామాల రైతులు అధిక సంఖ్యల పాల్గొన్నారు. కాగా ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ గతంలో వేసిన టెండర్ ను రద్దుచేసి కొత్తగా టెండర్ వేసి పనులు ప్రారంభించాల్సి వస్తుందని అందుకు కొంత ఆలస్యమవుతుందని తెలిపారు. ఇట్టి సమాధానం విన్న రైతులు జేఏసీ నాయకులు సంతృప్తి చెందలేదు. జేఏసీ మండల కన్వీనర్ ఎర్రగోకుల జశ్వంత్ బి ఆర్ ఎస్ మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్ లు మాట్లాడుతూ గతంలో మూడుసార్లు డెడ్ లైన్లు పెట్టి, ఎన్నికల ముందు ఇచ్చిన హామీని గడువు తేదీని బీర్ల ఐలయ్యకు గుర్తు చేశారు. వాయిదాలు వేయడం వల్ల రాజపేట మండల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వివరించారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య కడుపులో తలపెట్టిన జేఏసీ మండలాధ్యక్షులు ఎర్రగోకుల అధ్యక్షులు వెంటనే సాగునీరు అందిస్తే ప్రజల పక్షాన కృతజ్ఞతలు చెబుదామని, నీటి కోసం ప్రాధేయ పడ్డారు. రైతుల కోసం తమ ఆరాటమని సట్టు తిరుమలేష్ అన్నారు.

## ఢిల్లీలో ఘన విజయంతో బీజేపీ నేతలు సంబురాలు



రాజపేట, ప్రజాస్ఫూర్తి : భారతీయ జనతా పార్టీ ఢిల్లీలో ఘన విజయం సాధించిన సందర్భంగా రాజపేట మండలంలోని బొందుగుల గ్రామం లో విజయోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు ముత్యం రాజు, జిల్లా కౌన్సిల్ మెంబర్ పుట్ట వీరయ్య, జిల్లా కార్యదర్శి రాజం నగేష్, గ్రామ శాఖ బీజేవైఎం అధ్యక్షుడు బల్ల శ్రీకాంత్,బీజేవైఎం జనరల్ సెక్రెటరీ వట్టెం శ్రీకాంత్, కోనేటి శ్రవణ్ బూత్ అధ్యక్షుల చాపురం శ్రీశైలం, పోణమైన నాగరాజ్, కోనేటి శ్రీరామ్,అమరాజ్ సిద్ధులు,అమరాజు శ్రీనివాస్, బండ ఆంజనేయులు, తరిగొప్పుల భాస్కర్, కొత్తోజు నరేష్ పొనమైన రాజు,రాజమైన కుమార్, ముత్యం ఉప్పలయ్య, ముత్యం ప్రవీణ్, సీనియర్ నాయకులు కార్యకర్తలు సంబరాల్లో పాల్గొన్నారు. బేగంపేట గ్రామంలో భారతీయ జనతా పార్టీ జిల్లా నాయకులు జెల్ల పరమేష్ గౌడ్ ఆధ్వర్యంలో సీట్లు పంచుకొని, బాణాసంచాలు కాల్చి కార్యకర్తలు అందరూ సంబరాలు చేసుకున్నారు. ఢిల్లీ శాసనసభ విజయం సాధించిన అభ్యర్థులందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజలు ఆమ్ ఆద్మీ పార్టీకి మద్యం పాలసీలో నిందితులైన మాజీ ముఖ్యమంత్రి కేజ్రివాల్ ఉప ముఖ్యమంత్రి మనిషిపొడియా, అదేవిధంగా సత్యంధ్రాజైన్ తదితరులు అందరికి ప్రజలు ఓటు అనే ఆయుధంతో తగిన గుణపాఠం చెప్పారని , అదేవిదంగా కాంగ్రెస్ పార్టీకి గాడిద గుడ్డు ఇచ్చారు అని, అదేవిదంగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో ఇదే స్ఫూర్తితో అన్ని స్థానాలు భారతీయ జనతా పార్టీ విజయం సాధించాలని పిలుపునివ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మేకల రమేష్,కొత్తపల్లి ప్రసాద్, బూత్ అధ్యక్షులు , ప్యాట నగేష్ ,ఓరుగంటి నాగరాజు, బోగ కమలాకర్,యువ మోర్చ మండల అధ్యక్షులు మార్క శివ యాదవ్ ,రేణికుంట మాజి ఉపసర్పంచ్ బూర్గు శేఖర్ రెడ్డి,మెందు భగవాన్ రెడ్డి,పవన్,సందీప్,కళ్యాణ్, బిల్ల , మల్లేష్, జంగిర్,రాజు, గణేష్,బాబు, భాస్కర్,పెంట రాజు,రవి,ప్రభు తదితర సీనియర్ నాయకులు పాల్గొన్నారు

## ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన

కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వి నగర్ కాలనీలో గల వినాయక పార్క లో బిజెపి వివి నగర్ డివిజన్ అధ్యక్షులు డాక్టర్ యన్ వంశి రెడ్డి ఆధ్వర్యంలో సుమన హాస్పిటల్ వారి సౌజన్యంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ఈ వైద్య శిబిరంలో ఆరోగ్య సమస్యలు తెలియజేయడానికి కాలనీవాసులు 100 పైగా తరలివచ్చారు . ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## నూతన రక్షిత ప్రహరీ గోడ ప్రారంభం



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి ) : కేపీహెచ్ బీ కాలనీ 5వ ఫేజ్లో గల ఇండిస్ వన్ సిటీ గేటెడ్ కమ్యూనిటీలో నూతన రక్షిత ప్రహరీ గోడ ను ఆదివారం బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ గత కొంతకాలంగా ప్రహరీ గోడ నిర్మాణంలో కొన్ని సమస్యలు తలెత్తగా అట్టి సమస్యను తన దృష్టికి తీసుకవచ్చారు. ఇరు వర్గాలను పిలిచి సయోధ్య కుదిరిచి సమస్యను పరిష్కరించి ప్రహరీ గోడ నిర్మాణానికి సహకరించగా ఇండిస్ వన్ సిటీ కమిటీ సభ్యులు వారికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కెపిహెచ్బి డివిజన్ బిజెపి కంటెస్టెంట్ కార్పొరేటర్ ప్రీతం రెడ్డి, ఇండీస్ వన్ సిటీ చైర్మన్ రాచ వెంకీ, కార్యదర్శి ఏచూరి రవి, కోశాధికారి నవనీత్ మెహతా, డైరెక్టర్స్ రాణి ,శ్రీవిద్య, మీనా రెడ్డి ,వెంకట్ నాయుడు, నరసింహారావు ,పట్టాభి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు

## రాబోయే రోజుల్లో సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందిస్తాం

* **ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య**



రాజాపేట, ప్రజాస్ఫూర్తి : రాజపేట మండల కేంద్రంలో ఎన్ కే కన్వెన్షన్ హాల్లో ఆదివారం కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో ముఖాముఖి కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాబోయే రోజుల్లో రాజపేట మండలానికి సాగునీరు అందించే దిశగా అడుగులు ముందుకు వేస్తున్నా ని, మండలంలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తానని, రాబోయే రోజుల్లో సంక్షేమ పథకాలు ఆరు గ్యారంటీలో పూర్తిస్థాయిలో అందిస్తామని స్పష్టం చేశారు. ప్రజలను కొన్ని పార్టీలు అయోమయాన్ని గురి చేస్తున్నా యని రాజపేట మండలం ఒక క్రమశిక్షణగల నాయకత్వం తో ముందుకు వెళ్తున్నామని, ఏదేమైనా ఆలేరు అభివృద్ధి తన ఆకాంక్ష అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జిల్లా నియోజకవర్గ మండల గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే యశస్విని కలిపిన ఎండి మదార్



పాలకుర్తి, (ప్రజాస్ఫూర్తి) : పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రాజా రామ్మోహన్ రెడ్డి ని ఆదివారం జనగామ జిల్లా తాజా మాజీ జడ్పీ కో ఆప్షన్ మెంబర్ మొహమ్మద్ మదార్ మర్యాదపూర్వకంగా కలిశారు. పాలకుర్తి నియోజకవర్గ ఇన్చార్జి ఝాన్సీ రాజేందర్ రెడ్డి సమక్షంలో శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎండి మదార్ ఆదివారం ఎమ్మెల్యే యశస్విని రాజా రామ్మోహన్ రెడ్డి ని కలిశారు. ఈ సందర్భంలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ మీరు ఎలాంటి వారో అందరికీ తెలుసని, మీరు పార్టీలో రావడం అభినందనీయం అని అన్నారు. పార్టీ పటిష్టతకు అహర్నిశలు కృషి చేయాలన్నారు

## చిలుకూరు బాలాజీ ఆలయం అర్చకుడు రంగరాజన్పై దాడి..

: **పోలీసులకు ఫిర్యాదు**

హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం చిలుకూరు బాలాజీ ఆలయం ప్రధాన అర్చకుడు సీఎస్ రంగరాజన్పై దాడి ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. రంగరాజన్ ఇంట్లో ఉన్న సమయంలో ఆయనపై కొందరు దాడి చేసినట్లు స్థానిక పోలీసులకు ఫిర్యాదు అందింది. ‘‘నాపై 20 మంది దాడి చేశారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశాం. మిగతా వివరాలు విచారణలో తెలుస్తాయి. ఇంతకు మించి దీనిపై మాట్లాడను’’ అని రంగరాజన్ తెలిపారు. దాడి ఘటనను వివరించేందుకు ఆయన నిరాకరించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకూరు బాలాజీ ఆలయం సమీపంలోని రంగరాజన్ నివాసానికి శుక్రవారం కొందరు వ్యక్తులు వచ్చారు. రామరాజ్యం స్థాపనకు మద్దతివ్వాలని కోరారు. అందుకు ఆయన నిరాకరించడంతో .. వాగ్వాదానికి దిగి దాడికి పాల్పడ్డారు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన అతని కుమారుడిపై కూడా దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

# కరాటే ఆత్మరక్షణకు ఎంతగానో దోహదం

* **హైదర్నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాస్ రావు**



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : కరాటే ఆత్మరక్షణకు ఎంతగానో దోహదపడుతుందని హైదర్నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాస్ రావు అన్నారు. హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని ఏ ఎస్ రాజు నగర్ లో ఉన్న “ట్రెయిన్ యువర్ సెల్ఫ్” మార్షియల్ ఆర్ట్స్ అకాడమీ లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అకాడమీలో ట్రైనింగ్ తీసుకున్న విద్యార్థులు ఢిల్లీ, నేపాల్, సౌత్ ఆఫ్రికా తదితర దేశాల్లో జరిగిన పోటీల్లో గోల్డ్, బ్రాంజ్ , సిల్వర్ మెడల్స్ సాధించిన విద్యార్థులను ఆయన అభినందించి మెడల్స్ తో సత్కరించారు. ఈ సందర్భంగా నార్నె శ్రీనివాస రావు మాట్లాడుతూ “ట్రెయిన్ యువర్ సెల్ఫ్” మార్షియల్ ఆర్ట్స్ అకాడమీ కోచ్ నవీన్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో సౌత్ ఆఫ్రికా దర్బన్ లో జరిగిన ఇంటర్నేషనల్ కరాటే లో ఇండియా తరపున 30 కేజీ లో మాస్టర్ బిళరి సిల్వర్,35 కేజీ లో మాస్టర్ భార్గవ్ , 45 కేజీ లో మాస్టర్ సాయి సహస్రద్ బ్రాంజ్ మెడల్లు గెలవడం జరిగిందన్నారు. నేపాల్ ఖాట్మండు లో సీనియర్ ఈవెంట్ ఆర్గనైజేషన్ లో మాస్టర్ భార్గవ్ బ్రాంజ్ మెడల్ గెలవడం జరిగిందన్నారు. ముఖ్యంగా డిల్లీ లో జరిగిన అల్ ఇండియా కరాటే చాంపియన్షిప్ లో మాస్టర్ రోహిత సిల్వర్ మెడల్ గెలవడం చాల సంతోషంగా ఉందన్నారు. గెలిచిన పిల్లలకు , వారిని ప్రోత్సహించిన తల్లిదండ్రులకు , కోచ్ నవీన్ కు ప్రత్యేక అభినందనలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోచ్ నవీన్ కుమార్ గౌడ్, విజేతలు తల్లితండ్రులు, సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 10న జరిగే నిరసన ధర్నా ను జయప్రదం చేయాలి

* **సిపిఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకానీ లక్ష్మణ్**



కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 09, (ప్రజాస్ఫూర్తి ) : ప్రజా వ్యతిరేక కార్పొరేట్ల అనుకూల బడ్జెట్ కు వ్యతిరేకంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 10న హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద జరుగు నిరసన ధర్నాలో ప్రజలు, రైతులు కార్మికులు, అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకానీ లక్ష్మణ్ అన్నారు. పేదల కార్మికుల, రైతుల, పొట్ట గొట్టి కార్పొరేట్ల అనుకూలమైన బడ్జెట్ కు వ్యతిరేకంగా రేపు జరగబోయే ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కుత్బుల్లాపూర్ మండలం షాపూర్ నగర్ రైతు బజార్ లో కరపత్రాల పంపిణీ చేశారు. పార్లమెంట్ లో కేంద్ర ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా ప్రజా వ్యతిరేక కార్పొరేట్ అనుకూల బడ్జెట్ అని అన్నారు. పేదలు కార్మిక రైతు కూలీలకు ఈ బడ్జెట్లో తీవ్ర అన్యాయం జరిగిందని కార్పొరేట్లకు పెట్టుబడుదారులకు ప్రయోజనాలు చేకూర్చే బడ్జెట్ల ఉందన్నారు. కార్పొరేట్లు చెల్లించే పన్నులు రాయితీలు బ్యాంకు రుణాలు రద్దుచేసి పరోక్ష పన్నులు పెంచి సామాన్య మధ్యతరగతి ప్రజలపై భారాలు మోపిందన్నారు. నిత్యావసర సరుకుల ధరల తగ్గింపుకు రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర ఊసే లేదని సంక్షేమ పథకాలకు తీవ్రమైన కోత విధించారని తీవ్రంగా విమర్శించారు ప్రభుత్వం ఇప్పటికైనా తన ప్రజా వ్యతిరేక రైతు కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు పసుల అంజయ్య, పార్టీ నాయకులు తిమ్మప్ప, కే శీను, సాధులు, ప్రసాదు, మధు, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

## దిల్లీ ఎన్నికల్లో ఘన విజయం..

# హైదరాబాద్లో భాజపా సంబరాలు

హైదరాబాద్: దిల్లీ ఎన్నికల్లో భాజపా ఘన విజయం సాధించిన నేపథ్యంలో ఆ పార్టీకి చెందిన తెలంగాణ నేతలు సంబరాలు చేసుకున్నారు. నాంపల్లిలోని భాజపా కార్యాలయం వద్దకు పెద్ద ఎత్తున నేతలు, కార్యకర్తలు చేరుకుని బాణసంచా కాల్చారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీలు లక్ష్మణ్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, పార్టీ నేత చింతల రామచంద్రారెడ్డి తదితరులు ఈ సంబరాల్లో పాల్గొన్నారు. కార్యకర్తలు, నేతలు పరస్పరం మిఠాయిలు పంచుకున్నారు.









# మరణంలోనూ ఐదుగురికి ప్రాణం పోసిన డాక్టరమ్మ

హైదరాబాద్: రోడ్డు ప్రమాదంలో తాను మరణించినా.. ఐదుగురికి కొత్త జీవితాన్ని ప్రసాదించింది ఆ డాక్టరమ్మ. కన్న కుమార్తెను కోల్పోయిన పుట్టెడు దుఃఖంలో కూడా అవయవాలు దానం చేసేందుకు ముందుకొచ్చి ఔదార్యం చాటుకున్నారు ఆమె కుటుంబ సభ్యులు. వివరాల్లోకి వెళితే.. ఎల్బీ నగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పనిచేస్తున్న డాక్టర్ నంగి భూమిక నార్సింగ్ పీఎస్ పరిధిలో



ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్ అయింది. జీవన్‌దాన్ ట్రస్ట్ చొరవతో డాక్టర్ నంగి భూమిక అవయవాలు దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకొచ్చారు. దీంతో ఆమె లివర్, కిడ్నీలు, గుండె, లంగ్స్‌ను ఐదుగురికి అమర్చేందుకు వైద్యులు నిర్ణయించారు. పుట్టెడు దుఃఖంలోనూ ఔదార్యం చూపిస్తూ అవయవాలు దానం చేసేందుకు ముందుకు వచ్చిన డాక్టరమ్మ కుటుంబ సభ్యులకు సెల్యూట్ అంటూ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ ట్వీట్ చేశారు.



ఒకప్పుడు చందమామను చూపిస్తూ.. గోరుముద్దలు తినిపించేది అమ్మ! పిల్లాడు ఆరోగ్యంగా పెరిగేవాడు. ఇప్పుడు.. సెల్‌ఫోన్ చేతికిచ్చి, ముద్దలు తినిపిస్తుంది. నాన్నేమో.. ట్యాబ్ చూపిస్తూ లాల పోస్తున్నాడు. ఇలాంటి పరిస్థితుల్లో ఎదుగుతున్న చిన్నారులను.. పసితనంలోనే అనేక రుగ్మతలు చుట్టుముడుతున్నాయి. పెరుగుతున్న సాంకేతికత కొన్నిరకాల వ్యాధులకు కారణం అవుతున్నది. అందులో ఒకటి ఆటిజం. సెల్‌ఫోన్లు, ట్యాబ్‌ల వాడకం పెరిగేకొద్దీ ఆటిజం సమస్య హెచ్చుతున్నది.

# ఎండల్లో తప్పు చేయకండి!

**ఎండాకాలం వచ్చిందంటే చర్మానికీ, శరీరానికీ అవసరాలు మారతాయి. దానికి తగ్గట్టు కొన్ని విషయాల్లో మనమూ మారతాం. అక్కడే తప్పు చేసే అవకాశం ఉంది. ఇవి అవసరాలు కాదు, అనర్థాలు అంటున్నారు చర్మ, ఆరోగ్య నిపుణులు.**

### ఇంట్లో అక్కర్లేదు

సన్‌స్క్రీన్ బయటికెళ్లేప్పుడు మాత్రమే రాసుకోవాలి. ఇంట్లో ఉన్నా, కారులో వెళ్తున్నా అక్కర్లేదు అనుకోవడం అపోహ మాత్రమే. మనం ఎక్కడ ఉన్నా మన చుట్టూ ఉండే వెలుతురులో చర్మానికి హాని చేసే అతినీల లోహిత కిరణాలు ఉంటాయి. కాబట్టి తప్పకుండా ఈ సమయంలో సన్‌స్క్రీన్ వాడాలి.

### కడుగుతూనే ఉండాలి

ఎండాకాలం వచ్చిందంటే అదేదో యాడ్‌లో 'కడుగు బాబు కడుగు' అన్నట్టు మొహాన్ని మాటిమాటికీ నీళ్లతో కడుగుతుంటారు. ఇది ఎండవేళ చర్మానికి హాయిని కలిగించి, తేమగా ఉంచుతుందని అనుకుంటారు. కానీ ఇది నిజం కాదు. ఇలా మాటిమాటికీ నీటితో చర్మాన్ని కడగడం వల్ల 'ట్రాన్స్ ఎపిడెర్మల్ వాటర్ లాస్ (టీఈడబ్ల్యూఎల్)' అని పిలిచే ప్రత్యేక పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో చర్మం తేమను కోల్పోయి పొడిబారుతుంది.

### అద్దైతే చాలు

వేసవిలో ఏ వీధి మూలన చూసినా మజ్జిగ, పుదీనా రసం కుండలు, జీరా నీళ్లు, నిమ్మరసాలు దొరుకుతుంటాయి. ఎండవేళ చలువ చేస్తాయన్న ఉద్దేశంతో వాటిని స్వేచ్ఛగా తాగుతుంటారు. కానీ, ఇలా బయట దొరికేవి తాగేప్పుడు అక్కడ ఎంత పరిశుభ్రత పాటిస్తున్నారు, ఎలాంటి నీళ్లు వాడుతున్నారులాంటివి గమనించాలి. లేకపోతే పొట్టకు లేనిపోని తంటా తెచ్చినట్టే.

### అన్నీ తాగొచ్చు

ఎండవేళ శరీరంలో నీటి స్థాయుల్ని నిలిపి ఉంచేందుకు ద్రవాలు ఎక్కువగా తీసుకోవాలి. కాబట్టి మంచీ చెడులతో సంబంధం లేకుండా ఏమైనా తాగొచ్చు అనుకోవడం పొరపాటు. కేవలం మజ్జిగ, కొబ్బరినీళ్ల లాంటి సంప్రదాయ ఆరోగ్యకర పానీయాలకే ప్రాధాన్యం ఇవ్వాలి. మిల్క్‌షేక్‌లు, శీతల పానీయాల్లాంటి హై క్యాలరీ డ్రింకులను ఏ కాలంలో అయినా పక్కన పెట్టేయాల్సిందే.



# ఆటిజం.. అరువు తెచ్చుకుంటున్నం!

**మన దేశంలో ప్రతి 80మంది చిన్నారుల్లో ఒకరికి ఆటిజం సమస్య ఉండవచ్చనేది ఒక అంచనా. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని ఆటిజంపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏటా ఏప్రిల్ 2న 'వరల్డ్ ఆటిజం అవేర్‌నెస్ డే' నిర్వహిస్తున్నది. అసలు ఈ ఆటిజం అంటే ఏంటి, అది ఎందుకు వస్తుంది, రావడానికి గల కారణాలేంటి? దాని లక్షణాలు, ఆటిజం వల్ల పిల్లల్లో ఎలాంటి అనారోగ్యం ఏర్పడుతుంది? ఈ సమస్యను ఎలా గుర్తించాలి, నిర్ధారణ పద్ధతులు, చికిత్సా విధానం తదితర అంశాలను నేటి ఊపిరిలో తెలుసుకుందాం.**

**ఆటిజం** అనేది బయటికి కనిపించే ఒక రకమైన మానసిక వ్యాధి లక్షణం. చాలా ఆటిజం కేసుల్లో మాటలు మొదట్లో వస్తాయి. కానీ రెండేండ్లు వచ్చేసరికి మాటలు ఆగిపోతాయి. దీనినే 'రిగ్రెషన్' అంటారు. చాలామంది పిల్లల్లో మొదటి రెండేండ్లలోపే ఇది జరుగుతుంది. ఆటిజం సమస్య ఉన్న చిన్నారుల్లో నాలుగైదు ప్రధాన లక్షణాలు కనిపిస్తాయి.

1. భావ వ్యక్తీకరణ లేకపోవడం. అది భాష పరంగా గానీ, హావభావాలు వ్యక్తపరచడంలో గానీ సమస్య ఉంటుంది. అంటే వాళ్లు సరిగ్గా మాట్లాడలేరు.
2. ఇతరుల భావాలను గ్రహించలేరు. అంతేకాదు వారి భావోద్వేగాలను వ్యక్తపర్చలేరు.
3. సామాజిక బాంధవ్యాలు తెలియదు. అంటే ఇతరులతో కలిసి ఆడుకోవడం, కలివిడిగా ఉండటానికి ఇష్టపడరు. ఒంటరిగా ఉండాలని కోరుకుంటారు.
4. చేసిన పనినే మళ్లీ మళ్లీ చేస్తుంటారు.
5. ఈ చిన్నారుల్లో మానసిక పరిణతి తక్కువగా ఉంటుంది.

ఈ లక్షణాలన్నీ ఆటిజం పిల్లల్లో ప్రాథమికంగా కనిపిస్తుంటాయి. ఈ సమస్యలతో సతమతమవుతున్న వారిని ఆటిజం బాధితులుగా పరిగణిస్తారు.



### కారణాలు

- ఆటిజం సమస్యకు ఒక ప్రత్యేకమైన కారణమని ఏదీ లేదు. సాధారణంగా 9 నెలల నుంచి 18 నెలలు వచ్చే వరకు పిల్లలు భావాలను వ్యక్తీకరించడంతో పాటు, గ్రహించడం, భాష నేర్చుకోవడం చేయగలుగుతారు. ఈ వయసులో చిన్నారులకు ఫోన్‌లు, టీవీ, ట్యాబ్ లాంటివి అలవాటు కావడం వల్ల భావ వ్యక్తీకరణ, భాష నేర్చుకోవడం దెబ్బతింటుంది. స్క్రీన్ టైమ్‌కి అలవాటు పడితే ఈ సమస్యలు వస్తాయి.

అమెరికన్ పీడియాట్రిక్ సొసైటీ ప్రకారం మొదటి 3 సంవత్సరాల వరకు పిల్లలను ఫోన్, టీవీకి దూరంగా ఉంచడం మంచిది. వాటికి అలవాటుపడితే ఆటిజం వచ్చే ప్రమాదం ఉందని సదరు సొసైటీ హెచ్చరించింది.

- బహుళ భాషలను నేర్చుకోవాల్సి రావడమూ పిల్లల్లో ఆటిజం సమస్యకు కారణం కావొచ్చు. చిన్నారులకు మాటలు వచ్చే క్రమంలో.. తల్లిదండ్రులు వేర్వేరు భాషల్లో మాట్లాడటం వల్ల, పిల్లలకు ఏ భాషను స్వీకరించాలో అర్థం కాదు. వాళ్లు అయోమయానికి గురై భాషపై పట్టుచిక్కకపోవడం వల్ల ఆటిజానికి గురయ్యే అవకాశాలు ఉంటాయి.
- యాంటీ బయోటిక్స్ లాంటి ఔషధాలు ఎక్కువగా వాడటం కూడా ఆటిజానికి దారి తీయొచ్చు.
- ఐవీఎఫ్ ద్వారా జన్మించిన పిల్లల్లో కూడా ఆటిజం రిస్క్ కనిపిస్తున్నది.
- 18 నెలల వయసులో పిల్లలకు ఇచ్చే ఎంఎంఆర్ టీకా వల్ల కూడా ఆటిజం వస్తుందనేది ప్రజల్లో ఉన్న ఒక అపోహ మాత్రమే. దానికి సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి ఆధారాలు లేవు.

గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. పిల్లల పెంపకంలో పెద్దల పాత్ర అధికంగా ఉండేది. అమ్మమ్మ, నానమ్మ, తాతయ్య, మేనమామ, అత్తయ్య, చిన్నాన్న, పిన్ని... ఇలా ఎవరో ఒకరు పిల్లలతో సమయం గడిపేవారు. అప్పట్లో సెల్‌ఫోన్‌లు, ట్యాబ్‌ల ఊసే లేదు. మనుషుల మధ్య కమ్యూనికేషన్ ఎక్కువగా ఉండేది. నిరంతరం వారి మధ్య ఉండటం వల్ల పిల్లల్లో భాషా వికాసం బాగా ఉండేది. హావభావాల వ్యక్తీకరణతో పాటు మానసిక పురోగతిలోనూ వయసుకు తగ్గ పరిణతి కనిపించేది. కానీ, ఇప్పుడు ఉమ్మడి కుటుంబాల ఉనికి గణనీయంగా తగ్గిపోయింది. నూటికి 90 శాతం న్యూక్లియర్ ఫ్యామిలీలే ఉంటున్నాయి. దీనికితోడు తల్లిదండ్రులు ఇద్దరూ ఉద్యోగాలు చేయడం వల్ల పిల్లలు అధిక సమయం ఒంటరిగా గడపాల్సి వస్తున్నది. మనుషులతో కన్నా డిజిటల్ కమ్యూనికేషన్ ఎక్కువైంది. ఏడాది వయసున్న పిల్లలు కూడా సెల్‌ఫోన్, ట్యాబ్‌తో ఆడుకోవడం కనిపిస్తున్నది. ఇలాంటి పరిస్థితులు సైతం ఆటిజానికి దారితీసే అవకాశాలు లేకపోలేదు.

### రోగ నిర్ధారణ పద్ధతులు

**ప్రత్యేక** లక్షణాలు కనిపించిన వెంటనే సంబంధిత వైద్యులను సంప్రదించాలి. ఆటిజాన్ని నిర్ధారించేందుకు ఇప్పటి వరకు ప్రపంచ వ్యాప్తంగా ఎలాంటి వైద్య పరిజ్ఞానం గానీ, రోగ నిర్ధారణ పద్ధతులు గానీ అందుబాటులో లేవు. కేవలం అనుభవజ్ఞులైన సైకాలజిస్టులు, సైకియాట్రిస్టులు మాత్రమే సమస్యను కొన్ని రకాల పరీక్షల ద్వారా నిర్ధారించగలరు.

### లక్షణాలు

- పిల్లలు తల్లిదండ్రుల కండ్లలోకి కూడా నేరుగా చూడలేకపోవడం
- పేరుపెట్టి పిలిచినా వెంటనే స్పందించకపోవడం
- ఇతర పిల్లలతో కలిసి ఆడుకోకపోవడం
- ఒంటరిగా ఉండేందుకే ఇష్టపడటం
- ఒకే రకమైన బొమ్మతో మాత్రమే ఆడుకోవడం, మరో బొమ్మ ఇస్తే తీసుకోకపోవడం
- కొందరు పిల్లల్లోనైతే స్పర్శ, వాసన, చూపు, వినికిడి వంటి జ్ఞానేంద్రియ వ్యవస్థ అసంబంద్ధంగా ఉంటుంది.

ఈ లక్షణాలన్నీ మొదటి మూడు సంవత్సరాల్లోపు కనిపిస్తాయి.

### చికిత్సా పద్ధతులు

ఆటిజానికి సంబంధించిన లక్షణాలను ఎంత త్వరగా గుర్తించి, సరైన థెరపీలను అందించగలిగితే అంత మంచిది. 6 నెలల్లోనే 50 శాతం సమస్యను నివారించవచ్చు. కనీసం 3 సంవత్సరాల్లోపు సమస్యను గుర్తించి చికిత్స అందిస్తేనే ఫలితం ఉంటుంది. ఈ 3 సంవత్సరాల గోల్డెన్ టైమ్ దాటిపోతే ఎలాంటి చికిత్సలు అందించినా ఫలితం ఆశించిన మేరకు ఉండకపోవచ్చు. ఆటిజం బాధిత చిన్నారులకు ప్రధానంగా మూడు రకాల థెరపీలతో చికిత్స అందిస్తారు. అందులో 1.ఆక్యుపేషనల్ థెరపీ 2. బిహేవియర్ థెరపీ 3. స్పీచ్ థెరపీ

**1.ఆక్యుపేషనల్ థెరపీ:**

పిల్లల్లో ప్రారంభ దశలో జ్ఞానేంద్రియాలు అసంబద్ధంగా ఉన్నట్లు గుర్తిస్తే, ఆక్యుపేషనల్ థెరపీ అందించవచ్చు. దీని వల్ల ఐదు జ్ఞానేంద్రియాలు నియంత్రణలోకి వచ్చి, సమస్య దాదాపుగా పరిష్కారమవుతుంది.



**2.బిహేవియర్ థెరపీ:**

బిహేవియర్ థెరపీతో పిల్లల అసాధారణ ప్రవర్తనకు సంబంధించిన సమస్యలు పరిష్కరించవచ్చు.

**3. స్పీచ్ థెరపీ:**

ఆటిజం పిల్లల విషయంలో స్పీచ్ థెరపీ చాలా ముఖ్యమైంది. మొదటి రెండు థెరపీలు... అంటే ఆక్యుపేషనల్ థెరపీ, బిహేవియర్ థెరపీల తర్వాతే స్పీచ్ థెరపీ ఇవ్వాల్సి ఉంటుంది. అప్పుడే ఇది ప్రభావవంతంగా పనిచేస్తుంది.

### సలహాలు

- ప్రారంభ దశలోనే గుర్తించి నిపుణులైన వైద్యులను సంప్రదించాలి.
- మూడేండ్లలోపు పిల్లలను బ్లూ లైట్‌కు దూరంగా ఉంచాలి. అంటే సెల్‌ఫోన్స్, ట్యాబ్స్, టీవీలు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలు ఇవ్వకూడదు.
- పిల్లలకు ఎలక్ట్రానిక్ పరికరాలు ఇచ్చి, ఒంటరిగా వదిలేయకుండా వారితో తల్లిదండ్రులు లేదా ఇతర కుటుంబ సభ్యులు గడపడం ఉత్తమం.





# నిద్రలోనూ సుఖం లేదు!

**శారీరక** శ్రమకు, మానసిక ఆందోళనకు చక్కని ఔషధం నిద్ర. ఆరు గంటలు ఆదమరచి నిద్దరోతే.. సమస్యలన్నీ పరారైన అనుభూతి కలుగుతుంది. కానీ, సుఖమెరుగని నిద్ర.. అతివలకు అంతగా అందడం లేదని సర్వేల సారాంశం. స్లీప్ ఫౌండేషన్ ఇచ్చిన నివేదిక.. పురుషుల కన్నా స్త్రీలు నిద్రలేమితో ఎక్కువగా బాధపడుతున్నారని తేల్చింది. ఉద్యోగం, ఇల్లు, పిల్లలు, ఇతర బాధ్యతలతో మల్టీ టాస్కింగ్ చేస్తున్న మహిళలు సరైన నిద్ర లేక సతమతమవుతున్నారని నివేదిక సారాంశం. ఇందుకు కారణాలూ లేకపోలేదు. రుతుక్రమంలో ఈస్ట్రోజెన్, ప్రొజెస్టిరాన్లలో హెచ్చుతగ్గులు నిద్రకు భంగం కలిగిస్తాయి. ముఖ్యంగా రుతుస్రావం ముందు, మెనోపాజ్ సమయంలో వేడి ఆవిర్లు, రాత్రి చెమటలు నిద్రను భంగపరుస్తున్నాయని పరిశోధకులు తేల్చారు. అంతే కాదు గర్భిణిగా ఉన్నప్పుడు హార్మోన్లలో చోటుచేసుకునే మార్పుల కారణంగా శారీరక అసౌకర్యం ఏర్పడుతుంది. ఇది నిద్ర నాణ్యతపై గణనీయంగా ప్రభావం చూపుతుందట. ఈ నిద్రలేమి హృదయ సంబంధ వ్యాధులు, మానసిక రుగ్మతలకు దారి తీస్తుందని ఆరోగ్యరంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. సుఖనిద్రకు తగ్గ ఏర్పాట్లు చేసుకోవడం అవసరమని సూచిస్తున్నారు.

# స్నానం తర్వాత బ్రషింగా?

**ఒక్కోసారి** హడావుడిగా, ఏదో ఆలోచనలో ఉండి బ్రష్ చేసుకోలేదనే విషయం మరిచిపోయి స్నానం చేసేస్తుంటాం. తర్వాత గుర్తొచ్చి అప్పుడు బ్రష్ చేసుకుంటాం. ఇది ఎప్పుడో పొరపాటున ఒకసారి జరిగితే పర్వాలేదు. కానీ, అదే అలవాటుగా మారితే మాత్రం చర్మానికి నష్టమేనని హెచ్చరిస్తున్నారు ఆరోగ్య నిపుణులు. మనం పళ్లు తోముకున్నప్పుడు బ్యాక్టీరియా నోటి నుంచి చర్మం మీదకు చేరే ఆస్కారం ఎక్కువగా ఉంటుంది. అందువల్ల నోటి చుట్టూ, గడ్డం చుట్టూ ఇరిటేషన్ వచ్చే అవకాశం ఉంటుంది. తర్వాత అది నెమ్మదిగా మొటిమలకు కారణమవుతుంది. బ్రష్ చేసే సమయంలో చర్మం మీదికి బదిలీ అయిన బ్యాక్టీరియా వల్ల చర్మం మీద పగుళ్లు కూడా ఏర్పడవచ్చని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అందుకే స్నానానికి ముందే బ్రష్ చేసుకోవడం సురక్షితం. ఒక వేళ స్నానం తర్వాత బ్రష్ చేయాల్సి వస్తే ముఖాన్ని మరోసారి సబ్బుతో లేదా ఫేస్‌వాష్‌తో శుభ్రం చేసుకోవాలని సూచిస్తున్నారు.



# ముందే తినేయాలి!

**రోజూ వీలైనంత త్వరగా భోజనంచేస్తే గుండె రక్తనాళాల వ్యాధుల ముప్పు తగ్గుతుందట. నేచర్ కమ్యూనికేషన్స్ జర్నల్‌లో ప్రచురితమైన ఈ అధ్యయనం కోసం పరిశోధకులు 1,03,389 మంది నుంచి ఆహార విధానాలు, గుండె రక్తనాళాల జబ్బులకు సంబంధించిన సమాచారం సేకరించారు. వీరిలో 79 శాతం మంది మహిళలే. పరిశోధనలో పాల్గొన్నవాళ్ల సగటు వయసు 42 ఏండ్లు..**

**వయసు,** లింగం, కుటుంబ పరిస్థితి మొదలైన సామాజిక పరిస్థితులు, ఆహారంలో పోషకాల నాణ్యత, జీవనశైలి, నిద్రా చక్రాన్ని పరిశోధకులు పరిగణనలోకి తీసుకున్నారు. పొద్దున్నే టిఫిన్ చేయకుండా భోజనం చేసేవారిలో ఒక్కో గంట ఆలస్యానికి గుండె రక్తనాళాల వ్యాధుల తీవ్రత 6 శాతం పెరుగుతుందని పరిశోధకులు కనుక్కొన్నారు. అంటే పొద్దునే 9 గంటలకు తినే వ్యక్తికి 8 గంటలకే తిన్న వ్యక్తితో పోలిస్తే గుండె రక్తనాళాల జబ్బుల ముప్పు 6 శాతం ఎక్కువగా ఉంటుందన్న మాట. 9 తర్వాత ఒక్కో గంట గడుస్తుంటే ఈ ముప్పు 28 శాతం ఎక్కువగా ఉంటుందని అధ్యయనం వెల్లడించింది. అయితే, ముందురోజు రాత్రి చివరి భోజనానికి, తర్వాతి రోజు ఉదయం భోజనానికి మధ్య విరామం ఎక్కువగా ఉంటే గుండె రక్తనాళాల వ్యాధుల ముప్పు తక్కువట. అలా ఈ పరిశోధన రోజూ పొద్దున, సాయంత్రం భోజనాలు వీలైనంత త్వరగా ముగించేయాలని వెల్లడిస్తున్నది. గ్లోబల్ బర్డన్ ఆఫ్ డిసీజెస్ అధ్యయనం ప్రకారం ప్రపంచ ప్రజల్లో మరణాలకు కారణమయ్యే వ్యాధుల్లో గుండె రక్తనాళాల సమస్యలే ముందువరుసలో ఉన్నాయి.

2019లో గుండె సమస్యలతో 18.6 మిలియన్ల మంది మరణించారు. వీటిలో 7.9 శాతం మరణాలకు ఆహారపు అలవాట్లే ప్రధాన కారణంగా నిలిచాయి. అంటే... ''ఈ తరహా వ్యాధుల పుట్టుక, అభివృద్ధిలో ఆహారం కీలకపాత్ర పోషిస్తున్నదని తెలుస్తుంది. పశ్చిమ దేశాల సమాజాల ఆధునిక జీవనశైలి రాత్రి భోజనం మరీ ఆలస్యంగా చేయడం, పొద్దునే టిఫిన్ తీసుకోకపోవడం మొదలైన ఆహారపు అలవాట్లకు దారితీసింది. అయితే, ఉదయం, రాత్రి భోజనాలు వీలైనంత తొందరగా ముగించుకునే అలవాట్లను స్వీకరిస్తే గుండె రక్తనాళాల వ్యాధుల ముప్పు తగ్గించుకోవచ్చు'' అని పరిశోధకులు పేర్కొన్నారు.



# గ్లైఫోసేట్.. గర్భిణులకు ముప్పు



**గ్లైఫోసేట్‌ను** పంటల్లో కలుపు నివారణకు వాడతారు. ఇది పంటలకు హాని కలిగించకుండానే కలుపును నిర్మూలిస్తుంది. కాబట్టి, రైతులు దీన్ని విస్తృతంగా వాడుతున్నారు. ఏండ్ల తరబడి జరిగిన అధ్యయనాల ద్వారా గ్లైఫోసేట్ మనుషుల్లో క్యాన్సర్‌కు కారణం కావచ్చని భావిస్తున్నారు. ఆహారం రూపంలో అంతగా హాని కలిగించనప్పటికీ గ్లైఫోసేట్ ఆధారిత రసాయనాలు మనుషులను వివిధ రకాలుగా ప్రభావితం చేస్తాయి. చర్మం మండుతుంది. శ్వాసిస్తే ముక్కు రంధ్రాల్లో ఇబ్బందిగా ఉంటుంది. కొన్నిసార్లయితే తీవ్రతను బట్టి కాలేయం, కిడ్నీల పనితీరును దెబ్బతీస్తుంది. మరణం కూడా సంభవించవచ్చు. అంతేకాదు... గ్లైఫోసేట్ గర్భిణుల మీద మరింత దుష్ప్రభావం చూపుతుంది. గర్భధారణ సమయం ఏ కొంచెం తగ్గినా కూడా పుట్టబోయే శిశువు జీవితంపై ప్రతికూల ప్రభావాలకు దారితీస్తుంది. పైగా బిడ్డ పుట్టకముందే శాశ్వత నష్టం కూడా జరగవచ్చు. బిడ్డ పుట్టిన తర్వాత కూడా శరీర పెరుగుదలకు సంబంధించిన సమస్యలు తలెత్తుతాయి. గర్భిణులపై గ్లైఫోసేట్ ప్రభావం గురించి అమెరికాకు చెందిన 'ది ఎన్విరాన్‌మెంటల్ హెల్త్ యూనిట్' జరిపిన సర్వేలో ఈ వివరాలు తెలిశాయి. అధ్యయనం కోసం పరిశోధకులు 18– 40 సంవత్సరాల మధ్య వయసున్న 77 మంది మహిళల్ని ఎంచుకున్నారు. వీరిని 2015 జూన్ నుంచి 2016 జూన్ వరకు పరీక్షించారు. వీరి మూత్రం నమూనాల్లో దాదాపు 93 శాతం మందిలో గ్లైఫోసేట్ అవశేషాలు చెప్పుకోదగ్గ స్థాయిలో ఉన్నట్టు గుర్తించారు. పట్టణ మహిళలతో పోలిస్తే గ్రామీణుల్లో ఈ సమస్య ఎక్కువగా ఉన్నట్టు ఈ అధ్యయనంలో తేలింది. మొదట్లో దీనికి కారణం నీళ్లు కావచ్చని అనుకున్నారు. కానీ కలుపు నివారణకు గ్లైఫోసేట్ వాడటం వల్ల ఆయా పంటలను ఆహారంగా తీసుకోవడంతో ఈ దుస్థితి దాపురించిందని ఇప్పుడు అనుమానిస్తున్నారు. ఇది చిన్న అధ్యయనమే అయినప్పటికీ ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండాలనేది పరిశోధకుల హెచ్చరిక. మరో విషయం... గర్భిణులు తమ తొలి మూడు నెలల కాలంలో ఈ కలుపు నివారిణికి దూరంగా ఉండాలంటున్నారు పరిశోధకులు. లేదంటే తల్లిపాల ద్వారా కలుపుమందు అవశేషాలు పిల్లలకు చేరుకుంటాయి. కాబట్టి, రైతులు కూడా గ్లైఫోసేట్‌కు ప్రత్యామ్నాయాలను వాడాలి. గర్భిణులు తొమ్మిది నెలలపాటు ఈ కలుపుమందు ప్రభావం అసలే పడకుండా జాగ్రత్త వహించాలని పరిశోధకులు సూచిస్తున్నారు.

## టిక్‌టాక్‌ను ఎలన్ మస్క్ కొనేస్తున్నారా?



**న్యూయార్క్:** చైనాకు చెందిన ప్రముఖ షార్ట్ వీడియో యాప్ టిక్‌టాక్‌పై పలు దేశాలు ఇప్పటికే నిషేధం విధించాయి. తాజాగా అగ్రరాజ్యం అమెరికాలో కూడా టిక్‌టాక్‌కు నిషేధం ముప్పు పొంచి ఉంది. ఎంతో ఆదరణ పొందిన టిక్‌టాక్‌పై జాతీయ భద్రతా కారణాల దృష్ట్యా నిషేధం విధించాలని అమెరికా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో నిషేధం ముప్పు నుంచి తప్పించుకునేందుకు టిక్‌టాక్ మాతృసంస్థ బైట్ డ్యాన్స్ ఓ ప్లాన్ వేసినట్టు వార్తలు వస్తున్నాయి. టిక్‌టాక్ అమెరికా కార్యకలపాలను పూర్తిగా ప్రపంచ కుభేరుడు ఎలన్ మస్క్‌కు అమ్మెయ్యాలని బైట్ డ్యాన్స్ నిర్ణయించుకున్నట్టు వార్తలు వస్తున్నాయి.

టిక్‌టాక్‌ను కొనడం గురించి కొద్ది రోజుల క్రితం ఎలన్ మస్క్ మాట్లాడిన వీడియోను ఓ జర్మనీ వార్తా సంస్థ తాజాగా బయటపెట్టింది. టిక్‌టాక్‌ను కొనే యోచన తనకు లేదని మస్క్ స్పష్టం చేశారు. నాకు టిక్‌టాక్‌ను కొనాలనే ఆలోచన లేదు. టిక్‌టాక్ కోసం నేను బిడ్డింగ్ వేయలేదు. ఒకవేళ కొన్నా ఏం చేయాలనే ప్రణాళిక మా దగ్గర లేదు. కంపెనీలను కొనడం కంటే.. కొత్తగా నెలకొల్పడమే నాకు ఎక్కువ ఇష్టం అంటూ మస్క్ పేర్కొన్నారు. అమెరికాలోని కొన్ని రాష్ట్రాలు ఇప్పటికే టిక్‌టాక్ వినియోగంపై నిషేధాలను అమలు చేస్తున్నాయి. చైనా యాజమాన్యాన్ని వదులుకోకపోతే టిక్‌టాక్ నిషేధాన్ని ఎదుర్కోక తప్పదనే బిల్లుకు అమెరికా ప్రతినిధుల సభ ఇటీవల ఆమోదం తెలిపింది.

సంస్థ జాయింట్ వెంచర్‌లో అమెరికాకు 50 శాతం వాటా ఇస్తే టిక్‌టాక్‌కు ప్రయోజనం చేకూరేలా నిర్ణయం తీసుకుంటామని అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. దీంతో ట్రంప్ సన్నిహితుడైన మస్క్‌కే టిక్‌టాక్‌ను అమ్మెయ్యాలని బైట్ డ్యాన్స్ భావిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. 2017లో ప్రారంభమైన టిక్‌టాక్ అనతి కాలంలోనే ప్రపంచ వ్యాప్తంగా పాపులర్ అయిపోయింది. అంతే వేగంగా జాతీయ భద్రతా కారణాల దృష్ట్యా పలు దేశాల్లో టిక్‌టాక్‌పై నిషేధాలు మొదలయ్యాయి.

## రెండు వేలకుపైగా పెరిగిన గోల్డ్..



**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా ఆదివారం బంగారం, వెండి ధరలు స్థిరంగా ఉన్నాయి. ఈ క్రమంలో నేడు (ఫిబ్రవరి 9, 2025న) ఉదయం 6.23 గంటల నాటికి గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం చూస్తే 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 86,670గా ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 79,450కు చేరుకుంది. ఈ క్రమంలో గత 8 రోజుల్లో బంగారం ధరలు దాదాపు రెండు వేల రూపాయలకుపైగా పెరిగాయి.

ఇదే 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర ఫిబ్రవరి 1న రూ. 84,490గా ఉంది. ఇక వెండి రేట్ల విషయానికి వస్తే గత 8 రోజుల్లో కూడా ఇవి హెచ్చుతగ్గులకు లోనవుతూ ఒకే స్థాయికి వచ్చాయి. ప్రస్తుతం కిలో వెండి ధర రూ. 99,500 ఉండగా, ఫిబ్రవరి 1న కూడా వెండి రేటు ఇదే స్థాయిలో ఉంది. అంతేకాదు పుత్తడి ధరలు భవిష్యత్తులో లక్ష రూపాయలకు చేరుతాయని నిపుణులు చెబుతున్నారు.

### పడిపోయిన వ్యాపారం..

ఈ క్రమంలో బంగారం ధర క్రమంగా పెరగడం వల్ల గత ఎనిమిది రోజుల్లో తమ వ్యాపారం 25 శాతం పడిపోయిందని పలువురు వ్యాపారులు అన్నారు. పెళ్లిళ్ల సీజన్ కావడంతో కస్టమర్ల రాక బాగానే ఉంది. కానీ ప్రస్తుతం 22 క్యారెట్ల బంగారు ఆభరణాలకు బదులు, అనేక మంది 18 క్యారెట్ల బంగారు ఆభరణాల వైపు మొగ్గు చూపుతున్నారని వెల్లడించారు. ఈ క్రమంలో ప్రస్తుతం బంగారం ధరల పెరుగుదల ట్రెండ్ కొనసాగుతుందని అన్నారు. దీనికి ప్రధాన కారణం ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిస్థితులతోపాటు దేశీయ అంశాలు కూడా కారణాలుగా ఉన్నాయన్నారు.

### 14 క్యారెట్ గోల్డ్..

క్యారెట్ తక్కువగా ఉంటే ఆభరణాలు దృఢంగా ఉంటాయంటున్నారు వ్యాపారులు. అందువల్ల నగల వ్యాపారులు కొత్త, ఆధునిక డిజైన్లతో తక్కువ క్యారెట్ బంగారు ఆభరణాలను తయారుచేస్తున్నారు. 18, 22 క్యారెట్ల బంగారు ఆభరణాలకు హాల్‌మార్క్ ఉంటుంది. ఇదే క్రమంలో పలు వ్యాపారులు 14 క్యారెట్ల బంగారు ఆభరణాలను కూడా ప్రవేశపెడుతున్నారు. దీని వల్ల కూడా 18 క్యారెట్లు, 14 క్యారెట్ల బంగారు ఆభరణాలపై ప్రజల్లో మక్కువ పెరుగుతోంది.

### బంగారం స్వచ్ఛత తెలుసుకోవడం ఎలా?

బంగారం స్వచ్ఛతను గుర్తించడానికి (ఇండియన్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్) ద్వారా హాల్ మార్కులు ఇస్తారు. 24 క్యారెట్ల బంగారు ఆభరణాలపై 999, 23 క్యారెట్‌లపై 958, 22 క్యారెట్‌పై 916, 21 క్యారెట్‌పై 875, 18 క్యారెట్‌పై 750 అని రాసి ఉంటుంది. ఎక్కువగా బంగారాన్ని 22 క్యారెట్లలో విక్రయిస్తుండగా, కొందరు 18 క్యారెట్లను కూడా ఉపయోగిస్తున్నారు. 24 క్యారెట్ల బంగారం 99.9% స్వచ్ఛమైనది. 22 క్యారెట్ల బంగారం దాదాపు 91 శాతం స్వచ్ఛమైనది. 22 క్యారెట్ల బంగారంలో 9% రాగి, వెండి, జింక్ వంటి ఇతర లోహాలను కలపడం ద్వారా ఆభరణాలను తయారు చేస్తారు.

## ఓలా నుంచి మరో కొత్త స్కూటర్..

### ఒక్కసారి ఛార్జ్‌తో 320 కి.మీ దూరం!



**న్యూఢిల్లీ:** ఓలా ఎలక్ట్రిక్ తన కొత్త థర్డ్ జనరేషన్ ఎలక్ట్రిక్ స్కూటర్‌ను శుక్రవారం జనవరి 31న విడుదల చేసింది. తన పోర్ట్‌ఫోలియోను విస్తరిస్తూ, కంపెనీ కొత్త శ్రేణితో కూడిన శక్తివంతమైన మోడల్ స్కూటర్‌ను విడుదల చేసింది. కంపెనీ ఈ పోర్ట్‌ఫోలియోలో మొత్తం నాలుగు వేరియంట్లు ఉన్నాయి. దీని ప్రారంభ ధర రూ. 79,999. దీనితో పాటు, ఓలా తన ఫ్లాగ్‌షిప్ ఎలక్ట్రిక్ స్కూటర్ 1 ప్రో ప్లస్‌ను కూడా విడుదల చేసింది. ఇది డ్రైవింగ్ రేంజ్ పరంగా దేశంలోనే అతిపెద్ద ఎలక్ట్రిక్ స్కూటర్‌గా మారింది. ఈ ఫ్లాగ్‌షిప్ మోడల్ ఒక్కసారి ఛార్జ్ చేస్తే 320 కి.మీ. వరకు ప్రయాణించగలదని కంపెనీ పేర్కొంది. ఈ లాంచ్ గురించి కంపెనీ యజమాని భవిష్ అగర్వాల్ మాట్లాడుతూ, కొత్తగా విడుదల చేసిన మూడవ తరం స్కూటర్‌ను అనేక ప్రధాన మార్పులతో మార్కెట్లోకి విడుదల చేసినట్లు తెలిపారు.

# హిట్‌మ్యాన్ ఈజ్ బ్యాక్



## 76 బంతుల్లోనే సెంచరీ..

- కటక్ వన్డేలో టీమిండియా విన్... సిరీస్ కైవసం
- టీమిండియా-ఇంగ్లండ్ మధ్య రెండో వన్డే
- 4 వికెట్ల తేడాతో నెగ్గిన టీమిండియా
- 305 పరుగుల టార్గెట్‌ను 44.3 ఓవర్లలో ఛేదించిన వైనం
- రాణించిన అయ్యర్, అక్షర్ పటేల్

**కటక్:** భారత కెప్టెన్ రోహిత్ శర్మ ఇంగ్లాండ్‌తో రెండో వన్డేలో సెంచరీతో చెలరేగిపోయాడు. 30 బంతుల్లో హాఫ్ సెంచరీ మార్కును చేరుకున్న హిట్‌మ్యాన్.. 76 బంతుల్లో శతకాన్ని అందుకున్నాడు. దీంతో వన్డే క్రికెట్లో తన 32వ సెంచరీని నమోదు చేశాడు. ఈ ఇన్నింగ్స్‌తో ప్రపంచ క్రికెట్‌లో పలు రికార్డును హిట్‌మ్యన్ బద్దలు కొట్టాడు. ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు భారత ఫ్యాన్స్‌ను కుషీ చేశాడు.



కీలకమైన ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ ఫామ్‌లోకి వచ్చాడు. గత కొన్ని నెలలుగా పరుగులు చేసేందుకు తీవ్రంగా ఇబ్బంది పడ్డ హిట్‌మ్యాన్.. ఇంగ్లాండ్‌తో రెండో వన్డేలో సెంచరీతో గదం తొక్కాడు. మెరుపు బ్యాటింగ్‌తో ఇంగ్లాండ్ బౌలర్ల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీశాడు. మునుపటి రోహిత్‌ను గుర్తు చేస్తూ.. సిక్సర్ల వర్షం కురిపించాడు. ఈ క్రమంలోనే 76 బంతుల్లోనే సెంచరీ మార్కును అందుకున్నాడు.

విరాట్ కోహ్లీ తుది జట్టులోకి రావడంతో యశస్వి జైస్వాల్ బెంచ్‌కే పరిమితమయ్యాడు. దీంతో రోహిత్‌తో పాటు గిల్ ఓపెనర్‌గా వచ్చాడు. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్.. భారత్ ముందు 305 పరుగుల లక్ష్యాన్ని నిలిపింది. దీంతో వచ్చీ రాగానే భారత ఓపెనర్లు ఎదురుదాడికి దిగారు. ముఖ్యంగా రోహిత్ శర్మ సిక్సర్ల వర్షం కురిపించాడు. ఈ క్రమంలోనే వన్డే క్రికెట్ చరిత్రలో అత్యధిక సిక్సర్లు కొట్టిన రెండో బ్యాటర్‌గా నిలిచాడు. క్రిస్ గేల్ (331 సిక్సులు) అధిగమించాడు. రోహిత్ కంటే ముందు ఉన్ ఏకైక బ్యాటర్ షాహిద్ అఫ్రిదీ. అతడు వన్డే క్రికెట్‌లో 351 సిక్సలు కొట్టాడు.

ఇక ఆది నుంచి ఎటాకింగ్ గేమ్ ఆడిన రోహిత్.. 30 బంతుల్లోనే హాఫ్ సెంచరీ మార్కును అందుకున్నాడు. ఆ తర్వాత కూడా అదే జోరు కొనసాగించాడు. ఈ క్రమంలోనే 76 బంతుల్లోనే మూడంకెల మార్కును అందుకున్నాడు. రోహిత్ శర్మ కెరీర్‌లో ఇది రెండో వేగవంతమైన వన్డే సెంచరీ కావడం గమనార్హం. 2023లో అఫ్ఘానిస్థాన్‌తో మ్యాచ్‌లో అతడు 63 బంతుల్లోనే సెంచరీ చేశాడు.

ఈ సెంచరీ ద్వారా రోహిత్ శర్మ పలు రికార్డులు బద్దలు కొట్టాడు. ఇక ప్రస్తుతం ఉన్న యాక్టివ్ ప్లేయర్లలో అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక సెంచరీలు చేసిన మూడో బ్యాటర్‌గా రోహిత్ నిలిచాడు. ఈ జాబితాలో విరాట్ కోహ్లీ (81), జో రూట్ (52) ఉన్నారు. తాజా సెంచరీతో రోహిత్ స్టీవ్ స్మిత్ (48)ను అధిగమించాడు.

వన్డే క్రికెట్ చరిత్రలో అత్యధిక సెంచరీలు చేసిన మూడో బ్యాటర్‌గా రోహిత్ నిలిచాడు. విరాట్ కోహ్లీ (50), సచిన్ టెండూల్కర్ (49) అతడి కంటే ముందు ఉన్నారు.

## భారత వన్డే జట్టులోకి కొత్త ప్లేయర్..

**కటక్:** ఇంగ్లండ్-భారత్ మధ్య జరుగుతున్న రెండో వన్డేలో మరో కొత్త ఆటగాడు డెబ్యూ ఇచ్చాడు. స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి 50 ఓవర్ల ఫార్మాట్‌లోకి ఎంట్రీ ఇచ్చాడు. ఇప్పటివరకు టీ20లు ఆడుతూ వచ్చిన ఈ 33 ఏళ్ల మిస్టరీ స్పిన్నర్.. పొట్టి ఫార్మాట్‌లో అదరగొట్టడంతో ఇప్పుడు వన్డేల్లో డెబ్యూ చాన్స్ దక్కించుకున్నాడు. బారాబతి స్టేడియంలో మ్యాచ్ మొదలవడానికి ముందు వరుణ్‌కు టీమిండియా క్యాప్ ఇచ్చి ఆహ్వానించాడు సీనియర్ స్పిన్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా. రెండో వన్డేలో భారత్ ప్లేయింగ్ ఎలెవన్‌లో 2 కీలక మార్పులు చేసింది. తొలి మ్యాచ్‌లో ఆడిన యశస్వి జైస్వాల్ ప్లేస్‌లో విరాట్ కోహ్లీ, కుల్దీప్ యాదవ్ స్థానంలో వరుణ్ చక్రవర్తి టీమ్‌లో చోటు దక్కించుకున్నారు. కాగా, ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఇంగ్లండ్ తొలుత బ్యాటింగ్ చేయాలని డిసైడ్ అయింది. ప్రస్తుతం ఆ టీమ్ 13.1 ఓవర్లకు 1 వికెట్ నష్టానికి 89 పరుగులతో ఉంది. బెన్ డకెట్ (57 నాటౌట్), జో రూట్ (2 నాటౌట్) క్రీజులో ఉన్నారు. డేంజరస్ ఓపెనర్ ఫిల్ సాల్ట్ (26)ను అరంగేట్ర ఆటగాడు వరుణ్ వెనక్కి పంపించాడు. మరో 10 రోజుల్లో చాంపియన్స్ ట్రోఫీ ఉండటం, పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా గాయంతో ఆ టోర్నీలో ఆడటం అనుమానంగా మారిన నేపథ్యంలో వరుణ్‌ను దుబాయ్ ఫ్లైట్ ఎక్కించాలని రోహిత్-గంభీర్ భావిస్తున్నారట. ఇందులో భాగంగానే ఈ మ్యాచ్‌లో చక్రవర్తిని ఆడించారని తెలుస్తోంది.



## కపిల్‌దేవ్‌లా గిల్..

**కటక్:** టీమిండియా వైస్ కెప్టెన్ శుబ్‌మన్ గిల్ ఎప్పుడూ బ్యాటింగ్‌లోనే అదరగొడుతుంటాడు. అలాంటోడు ఇవాళ ఫీల్డింగ్‌లో దుమ్మురేపాడు. ఇంగ్లండ్‌తో జరుగుతున్న రెండో వన్డేలో గ్రౌండ్‌లో చురుగ్గా కదిలాడు గిల్. ఇదే క్రమంలో ప్రత్యర్థి స్టార్ బ్యాటర్ హ్యారీ బ్రూక్ ఇచ్చిన క్యాచ్‌ను అద్భుతంగా ఒడిసిపట్టుకున్నాడు. ఇంగ్లండ్ ఇన్నింగ్స్ 30వ ఓవర్‌లో యువ పేసర్ హర్షిత్ రాణా వేసిన స్లో బాల్‌ను గట్టిగా కొట్టేందుకు ప్రయత్నించాడు బ్రూక్. సరిగ్గా టైమ్ కాకపోవడంతో బంతి గాల్లోకి లేచింది.



### మెరుపు వేగంతో పరిగెత్తుతూ..

బంతి గాల్లోకి లేవగానే మిడాఫ్‌లో ఉన్న గిల్ పరుగు అందుకున్నాడు. వేగంగా పరిగెత్తుతూ బంతిని సమీపించాడు. బాల్ కింద పడుతుండటంతో అదే వేగంలో డైవ్ చేసి అందుకున్నాడు. కింద పడినా బంతిని మాత్రం అలాగే హెూల్డ్ చేశాడు. ఆఖరి క్షణం వరకు బంతి మీద దృష్టి మరల్చలేదు. అలాగే డైవ్ చేసినప్పుడు తన బాడీని బ్యాలెన్స్ చేశాడు. వెనక్కి పరిగెత్తుతూ అతడు పట్టిన ఈ క్యాచ్‌తో ఒక్కసారిగా 1983 వరల్డ్ కప్‌లో దిగ్గజం కపిల్ దేవ్ అందుకున్న బ్యాక్ రన్నింగ్ క్యాచ్‌ను నెటిజన్స్ గుర్తుచేసుకుంటున్నారు. ఇక, మ్యాచ్ విషయానికొస్తే.. టాస్ గెలిచిన ఇంగ్లండ్ తొలుత బ్యాటింగ్‌కు దిగింది. ఇప్పుడు ఆ జట్టు 38 ఓవర్లలో 3 వికెట్లకు 217 పరుగులతో ఉంది బట్లర్ సేన. జో రూట్ (50 నాటౌట్), జోస్ బట్లర్ (33 నాటౌట్) క్రీజులో ఉన్నారు. ఆ టీమ్ జోరు చూస్తుంటే అలవోకగా 300 పరుగుల మార్క్‌ను చేరుకునేలా ఉంది. భారత బౌలర్లు ఏ మేరకు ప్రత్యర్థిని అడ్డుకుంటారో చూడాలి.

## టీమిండియాను రెచ్చగొడుతున్న పాక్ ప్రధాని..

**న్యూఢిల్లీ:** క్రికెట్ లవర్స్ ఫోకస్ క్రమంగా చాంపియన్స్ ట్రోఫీపై వెళ్తోంది. మరో 10 రోజుల్లో ఈ మెగా టోర్నీ స్టార్ట్ కానుంది. పాకిస్థాన్ ఆతిథ్యం ఇస్తున్న ఈ ఐసీసీ టోర్నీలో విజేతగా నిలవాలని అన్ని జట్లు భావిస్తున్నాయి. ఎలాగైనా ట్రోఫీని ఎగరేసుకుపోవాలని చూస్తున్నాయి. సొంత దేశంలో టోర్నీ జరుగుతున్నందున కప్పు కొట్టేయాలని పాక్ ప్లానింగ్‌తో ఉంది. ఇందులో తప్పేం లేదు. కానీ ఆ దేశ ప్రధాన మంత్రి షెహ్‌బాజ్ షరీఫ్ భారత్‌ను లక్ష్యంగా చేసుకొని సంచలన వ్యాఖ్యలు చేయడం వివాదాస్పదంగా మారింది. రోహిత్ సేనను ఓడించడమే తమ టార్గెట్ అంటూ రెచ్చగొట్టారు.



### భారత్‌ను ఓడించాల్సిందే!

చాంపియన్స్ ట్రోఫీ కప్పును సొంతం చేసుకుంటే సరిపోదని.. చిరకాల ప్రత్యర్థి టీమిండియానూ తప్పకుండా ఓడించాలని షెహ్‌బాజ్ షరీఫ్ అన్నారు. ఫిబ్రవరి 23వ తేదీన దుబాయ్ వేదికగా ఈ రెండు జట్లు తలపడనున్నాయి. ఈ నేపథ్యంలో షరీఫ్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. 'పాకిస్థాన్ టీమ్ చాలా బలంగా ఉంది. ఇటీవల కాలంలో బాగా పెర్ఫార్మ్ చేసింది. అయితే వాళ్ల ముందు ఇప్పుడో టఫ్ చాలెంజ్ ఉంది. చాంపియన్స్ ట్రోఫీ కప్పును గెలవాలి. అదే సమయంలో భారత్‌ను కూడా ఓడించి తీరాలి. 29 ఏళ్ల గ్యాప్ తర్వాత ఓ బడా ఐసీసీ టోర్నమెంట్‌కు పాకిస్థాన్ ఆతిథ్యం ఇవ్వడం ఆనందంగా ఉంది' అని షరీఫ్ చెప్పుకొచ్చారు.

### గతాన్ని మరిచారా?

కప్పు కంటే భారత్‌ను ఓడించడమే ముఖ్యం అనే అర్థం వచ్చేలా పాక్ ప్రధాని చేసిన వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో దుమారం రేగుతోంది. ఇంత ఓవరాక్షన్ అవసరమా అంటూ దాయాదికి ఇచ్చిపడేస్తున్నారు నెటిజన్స్. 2021 టీ20 వరల్డ్ కప్ ఓటమి తప్పితే పాక్‌తో ఐసీసీ టోర్నీల్లో ఆడిన ప్రతిసారి టీమిండియానే గెలిచిందని గుర్తుచేస్తున్నారు. టీ20 ప్రపంచ కప్-2024లోనూ ఆ టీమ్‌ను రోహిత్ సేన చిత్తు చేసిందని చెబుతున్నారు. చరిత్ర మరిచారా.. ఈసారి కూడా భారత్ మీ బెండు తీయడం ఖాయమంటూ వార్నింగ్ ఇస్తున్నారు నెటిజన్స్. ఎంత రెచ్చగొడితే అంత ఘోర ఓటమి తప్పదని హెచ్చరిస్తున్నారు.

# తండేల్.. ఓ అద్భుతమన్న దిగ్గజ దర్శకుడు రాఘవేంద్రరావు

## చాలా రోజుల తర్వాత అద్భుతమైన ప్రేమకథ చూశానన్న దర్శక దిగ్గజం

**టాకీస్:** నాగ చైతన్య కొత్త సినిమా 'తండేల్' అద్భుతంగా ఉందని దిగ్గజ దర్శకుడు రాఘవేంద్రరావు ప్రశంసించారు. చాలా రోజుల తర్వాత అద్భుతమైన ప్రేమకథ చూశానని ప్రశంసలు కురిపించారు. 'చాలా రోజులకు తండేల్ వంటి అద్భుతమైన ప్రేమకథ చూశా. నాగ చైతన్య, సాయి పల్లవి పోటీ పడి నటించారు. కథ.. దాని నేపథ్యం సాహసోపేతమే. షాట్ మేకింగ్‌పై దర్శకుడి శ్రద్ధ బాగుంది. గీతా ఆర్ట్స్‌కు అభినందనలు. ఒక్క మాటలో చెప్పాలంటే ఇది ఒక దర్శకుడి సినిమా..!' అంటూ ట్వీట్ చేశారు. రాఘవేంద్రరావు ప్రశంసలపై చైతూ స్పందిస్తూ.. 'మీ నుంచి ప్రశంసలు అందుకోవడం చాలా సంతోషంగా ఉంది. థాంక్యూ సో మచ్ సర్' అంటూ రీట్వీట్ చేశారు.




రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ గా రూపొందించిన 'తండేల్' సినిమాతో చాలా రోజులకు నాగ చైతన్య హిట్ కొట్టిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని స్వయంగా చైతూనే వెల్లడించారు. హిట్ అనే మాట విని చాలా రోజులు అవుతోందని మీడియా ముందు వ్యాఖ్యానించారు. తండేల్ కథ విషయానికి వస్తే..

శ్రీకాకుళం జిల్లాకు చెందిన మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లి పాకిస్థాన్ నేవీకి చిక్కుతారు. ఆపై రెండేళ్ల పాటు పాక్ జైలులో శిక్ష అనుభవించడం, ఈ సందర్భంగా ఆయా మత్స్యకారుల కుటుంబాలలో చోటు చేసుకునే సంఘటనల ఆధారంగా కథ సాగుతుంది. తోటి మత్స్యకారులను ముందుండి నడిపించే తండేల్ గా రాజు పాత్రలో నాగ చైతన్య అద్భుతంగా నటించారు. రాజు ప్రేయసి సత్య పాత్రలో సాయి పల్లవి జీవించారు. కొన్ని సన్నివేశాలలో థియేటర్లలోని ప్రేక్షకులు కన్నీరు పెట్టుకున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

# 'ఆరెంజ్' మూవీ రీ రిలీజ్ ట్రైలర్ విడుదల




**టాకీస్:** గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, జెనీలియా జంటగా బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఆరెంజ్'. మెగా బ్రదర్ నాగబాబు నిర్మించిన ఈ సినిమా ఈ ప్రేమికుల రోజు (ఫిబ్రవరి 14)న రీ రిలీజ్ కాబోతోంది. ఈ సందర్భంగా మేకర్స్ చిత్ర రీ రిలీజ్ ట్రైలర్‌ని విడుదల చేశారు. కె. వెంకట్రావు సమర్పణలో అంజనా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై మెగా బ్రదర్ నాగబాబు నిర్మించిన చిత్రం 'ఆరెంజ్'. బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం అప్పట్లో సరైన విజయం సాధించలేదు కానీ.. రీ రిలీజ్‌లో మాత్రం మ్యాజిక్ చేసింది. ఇప్పుడు మరోసారి వాలెంటైన్స్ డేని పురస్కరించుకుని ఈ సినిమాను మరోసారి రీ రిలీజ్‌కు తెస్తున్నారు. గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, జెనీలియా జంటగా నటించిన ఈ చిత్ర రీ రిలీజ్ ట్రైలర్‌ని మేకర్స్ విడుదల చేశారు.

# అందాల ప్రగ్యా క్లోజప్ షో అదుర్స్




టాకీస్: ఇండస్ట్రీలో అడుగు పెట్టి దశాబ్దకాలం అయినా ప్రగ్యా జైస్వాల్ సాలిడ్ స్టార్‌డంను దక్కించుకోవడంలో మాత్రం సఫలం కాలేదు. కొన్ని సినిమాలు సక్సెస్ అయినా ఈమెకి మాత్రం ఆ క్రెడిట్ దక్కలేదు. అఖండ, డాకు మహారాజ్ సినిమాల్లో నటించి సక్సెస్ దక్కించుకున్నా ప్రగ్యా జైస్వాల్ వెంట వెంటనే ఆఫర్లు మాత్రం దక్కించుకోలేక పోతుంది. ఇండస్ట్రీలో ఎప్పటికప్పుడు ఆఫర్ల కోసం ఈ అమ్మడు ఎదురు చూడాల్సి వస్తుంది. ఈ పదేళ్ల కాలంలో ఈ అమ్మడు చేసిన సినిమాలు చాలానే ఉన్నాయి, కొన్ని హిట్ అయితే ఎక్కువ శాతం నిరాశ పరిచాయి. అయినా ఇండస్ట్రీలో కొనసాగ డానికి కారణం అందం అనడంలో సందేహం లేదు. ప్రగ్యా జైస్వాల్ తన అందమైన ఫోటో షూట్‌ను ఎప్పటికప్పుడు సోషల్ మీడియా ద్వారా షేర్ చేస్తూ ఉంటుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో దాదాపుగా మూడు మిలియన్ల ఫాలోవర్స్‌ను కలిగి ఉన్న ప్రగ్యా జైస్వాల్ రెగ్యులర్‌గా తన అందమైన ఫోటోలను పంచుకుంటూ ఉంటుంది. ఇంతటి అందమైన ప్రగ్యా జైస్వాల్‌కి ఎందుకు వరుసగా ఆఫర్లు రావడం లేదు, ఎందుకు ఇప్పటి వరకు సరైన బ్రేక్ దక్కలేదు అంటూ చాలా మంది కామెంట్స్ చేస్తూ ఉంటారు. కెరీర్ ఆరంభం నుంచి ఇప్పటి వరకు ప్రగ్యా తన అందంతో ఆఫర్లు దక్కించుకోవాల్సి వస్తుంది. నటన పరంగా కొన్ని సినిమాల్లో అవకాశం దక్కడం తో మెప్పించింది. అయినా నటిగా ఛాన్స్ దక్కడం లేదు. తాజాగా మరోసారి ఇన్‌స్టాగ్రామ్ ద్వారా తన అందమైన ఫోటో షూట్‌ను షేర్ చేసింది. ఈసారి అంతకు మించి అంటూ తన అందాల ఫోటోలను షేర్ చేయడం ద్వారా వైరల్ అవుతోంది. సింపుల్ ఔట్ ఫిట్‌లో మెడలో ఆభర ణాలు ఏమీ లేకుండా క్లీవేజ్ షో చేస్తూ చూపు తిప్పు కోనివ్వకుండా అందంగా ఉన్న ప్రగ్యా జైస్వాల్ మరోసారి అందరి దృష్టిని తనవైపు తిప్పుకుంది. ఇలాంటి ఫోటోలను షేర్ చేయడంతో ఫిల్మ్ మేకర్స్ పిలిచి ఆఫర్లు ఇస్తున్నారు. కానీ అదృష్టం కలిసి రాకపోవడంతో ఆ సినిమాలు ఆకట్టుకోవడం లేదు, ఒక వేళ హిట్ అయినా ఈమెకు పెద్దగా గుర్తింపు రావడం లేదు. ముందు ముం దు అయినా ప్రగ్యా జైస్వాల్‌కి హీరోయిన్‌గా మంచి ఆఫర్లు వస్తాయా అంటూ ఆమె ఫాలోవర్స్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ప్రగ్యా జైస్వాల్ సినిమాల విషయానికి వస్తే ఈ ఏడాదిలో డాకు మహారాజ్‌తో మొదలు పెట్టింది. ఇదే ఏడాదిలో మరోసారి బాలకృష్ణతో అఖండ 2 సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవ కాశాలు ఉన్నాయి. అధికారికంగా ప్రకటన రావాల్సి ఉంది. అఖండ సినిమాలో ప్రగ్యా జైస్వాల్ హీరోయిన్‌గా నటించిన కారణంగా సీక్వెల్‌లోనూ ఆమె నటించే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా నటిస్తున్న సినిమాలోనూ ప్రగ్యా జైస్వాల్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ రెండు సినిమాలు కాకుండా హిందీ, తమిళ్ లోనూ చర్చలు జరుగుతున్నాయి.

# సలీం కోసం అనార్ వెయిటింగ్




టాకీస్: షామా శికందర్ పరిచయం అవసరం లేదు. వరస ఫోటోషూట్‌లతో అగ్గి రాజేస్తున్న ఈ బ్యూటీ బోల్డ్ డస్కీ లుక్స్ తో హృదయాల్ని టచ్ చేస్తుంది. తాజాగా షామా షేర్ చేసిన ట్రెడిషనల్ శారీ లుక్ ఇంటర్నెట్ ని మరిగిస్తోంది. చీరలో షామా ముగ్ధ మనోహర రూపానికి యూత్ ఫిదా అయిపోతోంది. షామా ఈ కొత్త లుక్ లో సంథింగ్ స్పెషల్ గా కనిపిస్తోంది. దేవదాస్ కోసం ఎదురు చూస్తున్న పార్వతిలా.. సలీం కోసం వెయిటింగ్ లో ఉన్న అనార్ లాగా కనిపిస్తోందంటూ అభిమానులు కామెంట్ చేస్తున్నారు. సింపుల్ శారీకి డిజైనర్ బ్లౌజ్ కాంబినేషన్ పర్ఫెక్ట్ ఫిట్ గా కనిపిస్తోంది. చేతిలో కలువ రేకు బూరె బుగ్గను తాకుతుంటే యథాలాపంగా ఏదో ఆలోచిస్తూ కనిపించింది. షామా ట్రెడిషనల్ లుక్ కి బంగారు వర్ణం డిజైనర్ పరికిణీ, చెవులకు ఆ పొడవాటి జూకా అదనపు ఆకర్షణగా మారింది. ఈ లుక్ చూడగానే విరహంతో వీగిపోతున్న రాణిలా కనిపిస్తోందంటూ కొందరు అభిమానులు పొగిడేస్తున్నారు.

యే మేరీ లైఫ్ హై ఫేమ్.. నటి షామా.. జేమ్స్ మిల్లిరోన్ తో రొమాంటిక్ డేట్ లో ఉన్న సంగతి తెలిసిందే.

డేటింగ్ వ్యవహారం ఎలా ఉన్నా కానీ, షామా ఇప్పటికీ బాలీవుడ్ లో అవకాశాల కోసం వేటను ఆపలేదు.

సౌత్ సినీపరిశ్రమలపైనా దృష్టి సారించిందని కథనాలొచ్చాయి.

# ఆ క్రెడిట్ ఆయనకు దక్కాల్సిందే..

**టాకీస్:** కాలికి చిన్న గాయమై రష్మిక కాస్త రెస్ట్‌లో ఉన్నారు. దాంతో శనివారం జరిగిన 'పుష్ప 2 ది రూల్' థ్యాంక్స్ మీట్‌కు హాజరుకాలేకపోయింది. దీంతో చిత్రబృందాన్ని ఉద్దేశించి నేషనల్ క్రష్ రష్మిక ధన్యవాదాలు చెప్పారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా పోస్ట్ చేసింది. "శనివారం జరిగిన పుష్ప 2 థాంక్యూ మీట్‌లో నేను పాల్గొనలేకపోయా. కాకపోతే నేడు కొన్ని విషయాలు విబాగాలు అద్భుతంగా వర్క్ చేశాయి. ఈ ప్రయాణంలో నన్ను భాగం చేసినందుకు, నాకు ఎప్పటికీ గుర్తుండిపోయే ప్రత్యేకమైన రోల్ ఇచ్చినందుకు థాంక్యూ" అని ఆమె పేర్కొన్నారు. అల్లు అర్జున్, సుకుమార్ కాంబోలో తెరకెక్కిన 'పుష్ప: ది రైజ్'కు కొనసాగింపుగా 'పుష్ప: 2 ది రూల్' వచ్చింది. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మించింది. రష్మిక కథానాయిక. ఈ సినిమా గత డిసెంబరులో విడుదలై భారీ హిట్ అయింది. ఈ నేపథ్యంలోనే చిత్ర బృందం శనివారం రాత్రి హైదరాబాద్‌లో థ్యాంక్స్ మీట్‌ను ఏర్పాటు చేసింది. "ఈ సినిమా




చెప్పాలనుకుంటున్నా. సుకుమార్ సర్, అల్లు అర్జున్, మైత్రి మూవీ మేకర్స్ సంస్థకు థాంక్యూ. మీరెంతో శ్రమించి మాకు ఇలాంటి మాస్టర్‌పీస్‌ను అందించినందుకు ఒక ప్రేక్షకురాలిగా ధన్యవాదాలు. అలాగే, శ్రీవల్లి గా చెప్పాలంటే మీకు ఎప్పటికీ నా హృదయంలో ప్రత్యేక స్థానం ఉంటుంది. ఈ సినిమాని తెరకెక్కించడంలో అన్ని పోస్టర్‌పై నా బొమ్మ చూసుకున్న ప్రతిసారీ ఎంత అదృష్టమో అనిపిస్తుంది. మైత్రీ మూవీ మేకర్స్ వల్లే ఈ చిత్రం సాధ్యమైంది. దర్శకుడు సుకుమార్ ఓ విజయంలోని క్రెడిట్‌ను తాను తీసుకోకుండా అందరికీ పంచేస్తుంటాడు. కానీ, నిజంగా ఈ విజయంలోని పూర్తి క్రెడిట్ తనకే సొంతం" అని అన్నారామె.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.